www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -175 ఆదివారం 11 అక్టోబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# బీసీ రిజర్వేషన్లకు ఆమోదం

## మిశ్రా కమిషన్ సిఫారసులను ఆమోదించిన మంత్రివర్గం

**వార్డు సభ్యులకు పంచాయతీ యూనిట్‌గా రిజర్వేషన్ శాతం**

**జడ్పీ/ మున్సిపల్ చైర్‌పర్సన్, మేయర్‌కు రాష్ట్రం యూనిట్**

**సర్పంచ్, ఎంపీటీసీలకు మండలం యూనిట్‌గా నిర్ణయం**

**కమిషన్ సిఫారసుల ప్రకారం బీసీ కోటా ఇలా..**

**గ్రామ వార్డు సభ్యులు: 26.73 శాతం**
**సర్పంచ్‌లు: 27.95 శాతం**

**ఎంపీటీసీలు: 25.55 శాతం**
**ఎంపీపీలు, జడ్పీటీసీలు: 24.6 శాతం**

**జడ్పీ చైర్‌పర్సన్‌లు: 23.08 శాతం**
**మున్సిపల్ వార్డులు:32.78 శాతం**

**మున్సిపల్ చైర్‌పర్సన్‌లు: 33.02 శాతం, మేయర్‌కు 35.29 శాతం**



**అమరావతి,అక్టోబర్ 10(ప్రజావినికిడి):** స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై రాష్ట్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫారసుల ఆధారంగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో స్థానిక ఎన్నికలు వెంటనే నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం... శనివారం ప్రత్యేక క్యాబినెట్ సమావేశం నిర్వహించింది. ఈ భేటీలో మిశ్రా కమిషన్ సిఫారసులను ఆమోదించడంతో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చింది. గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, మిగతాది 2లో...



# అట్టుడికిన ఢిల్లీ

## మమతా, కేజ్రీవాల్ సహా పలువురు మాజీ సీఎంల అరెస్ట్

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్షాల డిమాండ్**

**అనుమతి లేదంటూ నేతలను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు**

**కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌తో పాటు పలువురు ఎంపీల నిర్బంధం**

**న్యూ ఢిల్లీ (ప్రజావినికిడి):** రాజధాని ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీమిగతాది 2లో...



# నిర్బంధాలకు భయపడబోం

**ప్రధాని మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరిన రాహుల్ గాంధీ**

**తమిళనాడు సీఎం విజయ్‌తో రాహుల్ గాంధీ భేటీ**

**అక్టోబర్ 10(ప్రజావినికిడి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ప్రభుత్వం ఎంతమంది పోలీసులనైనా మోహరించుకోవచ్చని, నేతలను, యువతను అరెస్టు చేసుకోవచ్చని, కానీ ప్రతిపక్షాల మిగతాది 2లో...



# రేడియల్ రోడ్డు-2 టెండర్లు రద్దు చేయండి

**సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ**

**ప్రాజెక్టులో భారీ అవకతవకలు జరిగాయని, ప్రభుత్వానికి రూ. 600 కోట్ల నష్టం వాటిల్లుతుందని ఆరోపణ**

**టెండర్ల ప్రక్రియపై కాగ్ ఆడిట్, శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్**

**హైదరాబాద్ అక్టోబర్ 10 (ప్రజావినికిడి):** రాష్ట్రంలో చేపట్టిన రేడియల్ రోడ్డు-2 ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని, వాటిని తక్షణమే రద్దు చేసి సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. మిగతాది 2లో...



# ఓడిపోతే ఈవీఎంలను నిందించడమా

**ప్రతిపక్షాల తీరుపై వెంకయ్యనాయుడు అసంతృప్తి**

**13 కోట్ల ఓట్ల తొలగింపు ఆరోపణలు అవాస్తవమన్న వెంకయ్యనాయుడు**

**ప్రతిపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని విమర్శ**



**అమరావతి,అక్టోబర్ 10(ప్రజావినికిడి):** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనలపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పందించారు. విపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని, రాజ్యాంగబద్ధ సంస్థలను రాజకీయ వివాదాల్లోకి లాగడం సరికాదని ఆయన హితవు పలికారు. మిగతాది 2లో...

# పంటల రక్షణకు గ్రామ కమిటీలు

## ఎల్‌నినో ప్రభావంపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష

**నీరు, విద్యుత్ సంక్షోభం రాకుండా సమగ్ర కార్యాచరణకు ఆదేశం**

**అక్టోబర్ 12న అనధికారిక కేబినెట్ భేటీ ఏర్పాటు**

**కరువు ప్యాకేజీ కింద కేంద్రం రూ.20,000 కోట్లు ఇవ్వాలని డిమాండ్**



**హైదరాబాద్ అక్టోబర్ 10(ప్రజావినికిడి):** ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని, దీన్ని అధిగమించేందుకు వెంటనే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ రుతుపవనాలు ప్రవేశించే వరకు సాగు, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన సీనియర్ అధికారులతో ఎల్‌నినో ప్రభావంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో తీవ్రమైన సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. నీటిని, విద్యుత్‌ను చాలా పొదుపుగామిగతాది 2లో...

# జగన్‌కు ఈడీ షాక్



## అక్రమాస్తుల కేసులపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్

**రోజువారీ విచారణ జరపాలని పిటిషన్‌లో అభ్యర్థన**

**దశాబ్దకాలంగా సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు**

**విచారణకు జగన్ వ్యక్తిగతంగా హాజరు కావాలని వినతి**

**హైదరాబాద్ అక్టోబర్ 10(ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని ఈడీ తన పిటిషన్‌లో అభ్యర్థించింది. మిగతాది 2లో...

# హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

**భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి**

**ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టీకరణ**

**కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ అనంతరం ప్రకటన**

**ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి**



**హైదరాబాద్ అక్టోబర్ 10 (ప్రజావినికిడి):** హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. మిగతాది 2లో...

# అట్టుడికిన ఢిల్లీ

(మొదటి పేజీ తరువాయి)

మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ సహా పలువురు విపక్ష నేతలను కూడా నిర్బంధించి డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. ఎన్నికల కమిషన్, ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన ఆరోపణలపై విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనేందుకు మమతా బెనర్జీ ఢిల్లీకి వచ్చారు. సెంట్రల్ ఢిల్లీలోని సౌత్ అవెన్యూ సమీపంలో పోలీసులు ఆమెను అడ్డుకోవడంతో, సమీపంలోని బస్టాండ్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ఆమెను, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓ్‌బ్రెయిన్, డోలా సేన్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు ఇదే నిరసనలో పాల్గొనేందుకు తన నివాసం నుంచి బయటకు వస్తున్న అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు మార్గమధ్యంలోనే నిర్బంధించారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ వంటి ఇతర నేతలను కూడా అరెస్ట్ చేశారు. జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఈ నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీకి చేరుకున్న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కేను కూడా పోలీసులు నిర్బంధించారు. నగరంలో నిరసనలకు ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఆందోళనకు ముందస్తు అనుమతి లేనందునే నేతలను అదుపులోకి తీసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణలతో పాటు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై విపక్షాలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల కమిషన్ జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టాయి. ఈ అరెస్టుల నేపథ్యంలో భవిష్యత్తులో తమ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని విపక్ష నేతలు సూచిస్తున్నారు.

## అభిజీత్ దిప్కే ఇంట విషాదం

**దీర్ఘకాలిక అనారోగ్యంతో మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలో మృతి**

**నిరసన తెలిపేందుకు ఢిల్లీ వెళ్లిన అభిజీత్ అరెస్టు**

‘కాక్రోచ్ జనతా పార్టీ‘ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన నాయనమ్మ ఈరోజు మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలో కన్నుమూశారు. అదే సమయంలో అభిజీత్ దిల్లీలో పోలీసుల అదుపులో ఉండటం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. ఈ కష్ట సమయంలో కుటుంబంతో ఉండేందుకు ఆయనకు పోలీసులు అనుమతి ఇస్తారా లేదా అనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్రలోని హింగోలి జిల్లా



సంతుక్ పింప్రి గ్రామంలో నివసిస్తున్న అభిజీత్ నాయనమ్మ (తండ్రి భగవాన్ దిప్కే తల్లి) గత కొంతకాలంగా దీర్ఘకాలిక అనారోగ్యం, వయసురీత్యా సమస్యలతో బాధపడుతున్నారు. శనివారం ఆమె ఆరోగ్యం విషమించి తుదిశ్వాస విడిచారు. ఈ వార్త తెలిసే సమయానికి అభిజీత్ దిల్లీలో పోలీసుల నిర్బంధంలో ఉన్నారు. ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ జంతర్ మంతర్ వద్ద నిరసనకు పిలుపునిచ్చింది. ఇందులో పాల్గొనేందుకు అభిజీత్, మరో ఇద్దరు పార్టీ సభ్యులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలతో కలిసి ముంబై నుంచి దిల్లీకి విమానంలో బయలుదేరారు. అయితే, విమానం ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయిన వెంటనే, దిల్లీ పోలీసులు విమానంలోకి ప్రవేశించి ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు.

# పంటల రక్షణకు గ్రామ కమిటీలు

(మొదటి పేజీ తరువాయి) వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్లో విద్యుత్ అందుబాటులో లేదని, అందువల్ల విద్యుత్‌పై ఆధారపడిన పనులను తాత్కాలికంగా వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, ఒక్క నీటిబొట్టు కూడా వృథా కాకుండా చూడాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మీడియా, సినిమా, సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలపై మరింత లోతుగా చర్చించేందుకు అక్టోబర్ 12న అనధికారిక మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. దీని తర్వాత రైతులతో కూడా సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. దీర్ఘకాలిక ప్రణాళిక ఖరారు కోసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, దాదాపు 235 మండలాల్లో కరవు ఛాయలు అలముకున్నాయని అధికారులు నివేదికల్లో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ అంశంపై కేబినెట్ సబ్-కమిటీ ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. కరవు ప్రభావిత మండలాలను ఆదుకునేందుకు రూ. 20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని అధికారులు గుర్తుచేశారు. అక్టోబర్ 12న జరిగే సమావేశంలో వ్యవసాయం, సాగు, తాగునీటి లభ్యత, విద్యుత్ డిమాండ్, తక్షణ ఉపశమన చర్యలపై రైతు సంఘాలు, నిపుణుల సలహాలు కూడా తీసుకోనున్నారు.

# నిర్బంధాలకు భయపడబోం

(మొదటి పేజీ తరువాయి)

పోరాటం మాత్రం ఆగదని శనివారం స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్‘ వేదికగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. గత దశాబ్ద కాలంగా తాను మోదీ, ఆరెస్సెస్‌లపై పోరాడుతున్నానని, వారి గురించి తనకు పూర్తిగా తెలుసని రాహుల్ అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సహా పలువురి పేర్లను ప్రస్తావిస్తూ.. వారి ప్రధాన లక్షణం పిరికితనమని ఆరోపించారు. వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని, అందుకే వారు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు.

“మోదీ గారూ.. మీకు నచ్చింది చేసుకోండి. 10 వేలు, 20 వేలు, 50 వేల మంది పోలీసులను పిలవండి. మా నేతలందరినీ, యువతను, మమ్మల్ని అరెస్ట్ చేయండి. కానీ మేం మిమ్మల్ని చుట్టుముడుతున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు“ అని రాహుల్ గాంధీ తన వీడియోలో ఘాటుగా హెచ్చరించారు. తమ వద్ద అవసరమైన సమాచారం ఉందని, రాజ్యాంగాన్ని, ప్రజల గొంతుకను కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. గడిచిన 10-15 ఏళ్లలో జరిగిన అన్యాయాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. దేశ యువత ధైర్యాన్ని చూసి గర్వపడుతున్నానని, నిరసనలు కొనసాగించాలని వారికి పిలుపునిచ్చారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించాయి. అయితే, శాంతిభద్రతల కారణాలను చూపుతూ ఢిల్లీ పోలీసులు ఈ ప్రదర్శనకు అనుమతి నిరాకరించారు. నిరసన స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నించిన పలువురిని అదుపులోకి తీసుకుని, భారీగా పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ పై వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఎన్నికల అంశాలపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సాగిస్తున్న పోరాటంలో భాగంగానే రాహుల్ ఈ ప్రకటన చేశారు.

తమిళనాడు రాజకీయాల్లో శనివారం ఓ ఆసక్తికరమైన సన్నివేశం ఆవిష్కృతమైంది. క్యాపిచినో, టిరమిసు, కుకీస్.. వీటికి రాజకీయ చర్చలు తోడైతే ఆ వాతావరణం ఎలా ఉంటుందో చెన్నై నగరం ప్రత్యక్షంగా వీక్షించింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ మధ్య జరిగిన ఈ భేటీ, ఇరు నేతల మధ్య బలపడుతున్న స్నేహ బంధానికి, రాజకీయ సమన్వయానికి అద్దం పట్టింది.

శనివారం ఉదయం చెన్నై శివార్లలోని నీలంకరైలో గల తన నివాసానికి విచ్చేసిన రాహుల్ గాంధీకి సీఎం విజయ్ సాదర స్వాగతం పలికారు. ఇరువురు నేతలు సుమారు గంటపాటు సమావేశమై సమకాలీన రాజకీయ పరిణామాలపై చర్చించారు. కేవలం అధికారిక చర్చలకే పరిమితం కాకుండా, వారి మధ్య నెలకొన్న స్నేహపూర్వక వాతావరణం అందరి దృష్టినీ ఆకర్షించింది.



## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని

### ప్రజలు నమ్మలేదు: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్ అక్టోబర్ 10(ప్రజావినికిడి):**

తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై విశ్వాసం ఉంచారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఆయన ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 21.86 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. ఈ గణాంకాలే ప్రభుత్వ పనితీరుకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనా సామర్థ్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు.

రాజకీయ లబ్ధి కోసం భూములపై బీఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలను, ఆరోపణలను ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూ అక్రమాలను తమ ప్రభుత్వం వెలికితీస్తోందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, ప్రజలకు వివాదరహిత భూములను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.

## తెలంగాణలో ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు

**హైదరాబాద్ అక్టోబర్ 10(ప్రజావినికిడి):**



తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ ఉత్సవాలు శనివారం రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సాంస్కృతిక అస్థిత్వానికి, ప్రకృతితో ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పూల పండుగ తొమ్మిది రోజుల పాటు కొనసాగనుంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, యువతులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సంప్రదాయ వస్త్రాలు ధరించిన మహిళలు, తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకుని ఆలయాలు, సామూహిక ప్రదేశాలకు తరలివచ్చారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ, చప్పట్లతో సందడి చేశారు. చారిత్రక హనుమకొండలోని వెయ్యి స్తంభాల గుడిలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంలోనూ ఉత్సవాలు నిర్వహించారు. నేడు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు, అక్టోబర్ 18న జరిగే సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. అక్టోబర్ 20న దసరా పండుగ జరగనుంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత, నైవేద్యం ఉంటుంది. ఈ ఉత్సవాల కోసం తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రధాన కూడళ్లను, ప్రభుత్వ కార్యాలయాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించింది. అక్టోబర్ 18న హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ప్రధాన సద్దుల బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సచివాలయం సమీపంలోని అమరవీరుల స్థూపం నుంచి మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా బయలుదేరి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఘాట్ల వద్ద నిమజ్జనం చేస్తారు. ఈ కార్యక్రమానికి భారీగా తరలివచ్చే ప్రజల కోసం ట్రాఫిక్ మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు వంటి పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, గ్రామాలు, పట్టణాల్లోని పాఠశాలల్లోనూ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తంగేడు, గునుగు వంటి సంప్రదాయ పూలతో బతుకమ్మలను పేరుస్తూ, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నారు.

# జగన్‌కు ఈడీ షాక్

(మొదటి పేజీ తరువాయి)

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్ద కాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తెలిపింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్ల పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని పేర్కొంది. విచారణకు జగన్‌తో పాటు ఇతర నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కూడా ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది. గత కొన్నేళ్లుగా ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో సవాళ్లు వంటి పలు న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది. కేసులు పదేళ్లుగా పెండింగ్‌లో ఉంటున్నాయంటేనే వాటిల్లో సహేతుకమైన పురోగతి లేదని స్పష్టంగా తెలుస్తోందని పేర్కొంది. ఈ కేసులకు సంబంధించి తదుపరి దర్యాప్తు ఇంకా పురోగతిలో ఉన్నట్లు పేర్కొంది. కాగా.. ఈడీ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై ఈ నెల 7న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శాంకోషీ, జస్టిస్ నర్సింగ్‌రావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. జగన్ కేసులను త్వరగా తేల్చాలని గతంలోనూ పలు పిటిషన్లు దాఖలైనట్లు హైకోర్టు గుర్తించింది. మాజీ మంత్రి హరిరామజోగయ్య దాఖలు చేసిన పిటిషన్‌తోపాటు ప్రజాప్రతినిధుల కేసుల్లో విచారణ వేగంగా జరిగేలా పర్యవేక్షణ చేపట్టడానికి హైకోర్టు సుమోటోగా ఒక పిటిషన్‌ను నమోదు చేసింది. సదరు పిటిషన్లపై గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. జగన్ కేసుల్లో రోజువారీ విచారణ చేపట్టాలని.. ఈ మేరకు నివేదిక సమర్పించాలని 2024లోనే సీబీఐ ప్రత్యేక కోర్టుకు ఆదేశాలు జారీచేసినట్లు౹తాజా విచారణలో దర్మాసనం గుర్తించింది. ఈ రెండు పిటిషన్లు తర్వాత విచారణకు లిస్ట్ కాలేదని.. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంది. ప్రస్తుతం ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా ఆ రెండు పిటిషన్లతో జత చేయాలని ధర్మాసనం రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది.

# ఓడిపోతే ఈవీఎంలను నిందించడమా

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారంటూ వస్తున్న ఆరోపణలు కేవలం అపోహ మాత్రమేనని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలతో సీఈసీ, ప్రధానమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సమంజసం కాదన్నారు. “రాజీనామా కోరడం తప్పు కాదు, కానీ రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదు“ అని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిస్తే తమ ఘనతగా చెప్పుకోవడం, ఓటమి పాలైతే ఈవీఎంలను నిందించడం కొన్ని పార్టీలకు అలవాటుగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం ఒక స్వతంత్ర సంస్థ అని, దానిని వీధుల్లోకి లాగడం దేశ ప్రతిష్టకు మంచిది కాదని అన్నారు. ఎన్నికల సంఘం సభ్యులంతా ఐక్యంగా ఉన్నామని చెబుతున్నా, ప్రతిపక్షాలు ఎందుకు ఆందోళన చేస్తున్నాయో అర్థం కావడం లేదని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు.

# బీసీ రిజర్వేషన్లకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్, మున్సిపల్ వార్డు సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్, మేయర్ సహా ఎనిమిది కేటగిరీల్లో రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం రాష్ట్ర మొత్తం జనాభా 5,27,46,589 కాగా, అందులో బీసీలు 2,65,94,418 (50.42 శాతం)గా కమిషన్ తేల్చింది. గ్రామీణ జనాభాలో 48.84శాతం, పట్టణ జనాభాలో 54.36శాతం బీసీలు ఉన్నారని పేర్కొంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి స్థానిక సంస్థకు బీసీ రిజర్వేషన్లపై వేర్వేరుగా సిఫారసులు చేశారు. వార్డు సభ్యులకు రిజర్వేషన్ శాతాన్ని నిర్ణయించేందుకు గ్రామ పంచాయతీని యూనిట్‌గా తీసుకుంటారు. సర్పంచ్, ఎంపీటీసీల రిజర్వేషన్లను మండలం యూనిట్‌గా, ఎంపీపీ, జడ్పీటీసీ రిజర్వేషన్లను జిల్లా యూనిట్‌గా, జడ్పీ చైర్‌పర్సన్, మున్సిపల్ చైర్‌పర్సన్/ మేయర్ రిజర్వేషన్లను రాష్ట్రం యూనిట్‌గా నిర్ణయిస్తారు. మున్సిపల్ వార్డు సభ్యులకు మున్సిపాలిటీ/ మున్సిపల్ కార్పొరేషన్ యూనిట్‌గా తీసుకుంటారు. సంబంధిత యూనిట్‌లోని మొత్తం జనాభాలో ఆయా వర్గాల నిష్పత్తి ప్రాతిపదికన తొలుత ఎస్టీలు, అ తర్వాత ఎస్సీలకు సీట్లు కేటాయిస్తారు. ఏ ప్రాంతంలో అయినా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఎక్కువగా ఉంటే, మొత్తం పరిమితి 50 శాతానికి మించకుండా బీసీ రిజర్వేషన్లను దానికి అనుగుణంగా మారుస్తారు. షెడ్యూల్డ్ ప్రాంతాలు, షెడ్యూల్డ్ తండాలతో పాటు ఎస్సీ, ఎస్టీ జనాభా కలిపి 50 శాతం కంటే ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో బీసీ రిజర్వేషన్లకు అవకాశం లేని యూనిట్లకు ఈ లెక్కల నుంచి మినహాయిస్తారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు సంబంధించి బీసీ సంక్షేమ శాఖ శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కలిపి రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని స్పష్టం చేసింది.

# రేడియల్ రోడ్డు-2 టెండర్లు రద్దు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

రూ.3,296 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టులో కావాల్సిన కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపించారు. ఔటర్ రింగ్ రోడ్డులోని బుద్వేల్ నుంచి కొడంగల్ సమీపంలోని ఎన్‌హెచ్-167ఎన్ వరకు నిర్మించ తలపెట్టిన 81.15 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పనులను ప్యాకేజీలుగా విభజించి, తమకు అనుకూలమైన సంస్థలకు కట్టబెట్టారని కేటీఆర్ తన లేఖలో ఆరోపించారు. తక్కువ ధరకు బిడ్లు దాఖలు చేసిన వారిని అనర్హులుగా ప్రకటించి, అంచనా వ్యయం కంటే ఎక్కువ ధరకు పనులు కేటాయించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.600 కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 30న బిడ్ల దాఖలుకు గడువు ముగియగా, కేవలం ఐదు పని దినాల్లోనే అంటే అక్టోబర్ 8 నాటికి టెక్నికల్ ఎవాల్యుయేషన్, అర్హతల పరిశీలన, ఫైనాన్షియల్ బిడ్ల ప్రారంభం, పనుల కేటాయింపు పూర్తి చేయడంపై కేటీఆర్ సందేహాలు వ్యక్తం చేశారు. ఇంత భారీ ప్రాజెక్టుకు సంబంధించిన 13 బిడ్లను ఇంత తక్కువ సమయంలో ఎలా ప్రాసెస్ చేశారని ప్రశ్నించారు.

ప్యాకేజీ-× పనులను ఎన్‌సీసీ లిమిటెడ్‌కు అంచనా వ్యయం కంటే 3.95 శాతం అధికంగా రూ.1,286.03 కోట్లకు కేటాయించారని, ప్యాకేజీ-×× బీవీఎస్ఆర్‌కు, ప్యాకేజీ-××× జీకేసీకి అప్పగించారని తన లేఖలో పేర్కొన్నారు. అంచనా వ్యయాలు, కోట్ చేసిన ధరలు, బిడ్డర్ల అనర్హతకు గల నిర్దిష్ట కారణాలు, తుది కాంట్రాక్ట్ విలువలు, టెక్నికల్ ఎవాల్యుయేషన్ నివేదికలతో సహా అన్ని రికార్డులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

గత మూడేళ్లలో హెచ్‌ఎండీఏ, హెచ్‌జీసీఎల్ కేటాయించిన రూ.100 కోట్లకు పైబడిన కాంట్రాక్టులపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)తో ప్రత్యేక ఆడిట్ జరిపించాలని, టెండర్ల ప్రక్రియపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూడా కేటీఆర్ కోరారు. కేటీఆర్ రాసిన ఈ లేఖతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కాంట్రాక్టులలో పారదర్శకతపై రాజకీయ చర్చ మరింత తీవ్రమైంది.

## హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం ఈ వివరాలను కిషన్ రెడ్డి ‘ఎక్స్‘ (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. “రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా చట్టవిరుద్ధం“ అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం. మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది. ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన ‘కవచ్‘ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
ఆదివారం 11 అక్టోబర్ 2026

# యోగా సాధనకు స్థలం కేటాయించాలని కొలన్ హన్మంత్ రెడ్డి కి వినతి..





**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని నిజాంపేట్‌కు చెందిన పతంజలి యోగా టీమ్ వెల్నెస్ అసోసియేషన్ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి, యోగా సాధన, ధ్యానం నిర్వహించేందుకు అనువైన స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.గత ఎనిమిదేళ్లుగా నిజాంపేట్‌లో యోగా,ధ్యానం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని,ప్రస్తుతం ఎండ,వర్షం, వాహనాల కాలుష్యం,రోడ్డు భద్రత వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అసోసియేషన్ సభ్యులు వివరించారు. యోగా సాధనకు అనువైన స్థలం కల్పించి తమకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి,నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, పతంజలి యోగా టీమ్ వెల్నెస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక అక్రమ రవాణా కేసును ఛేదించిన టోలిచౌకి పోలీసులు..

**24 గంటల్లోనే ఎనిమిది మంది నిందితుల అరెస్ట్.. -ఆరు సెల్‌ఫోన్లు, ఆటో స్వాధీనం..**

**ఆహారం,వసతి పేరుతో బాలికకు మాయమాటలు.. వ్యభిచార గృహానికి తరలించి రూ.30 వేలతో బేరం**




**హైదరాబాద్,(ప్రజావినికిడి):** మైనర్ బాలికను అపహరించి, అక్రమంగా తరలించి, బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టిన కేసులో టోలిచౌకి పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, కేసు నమోదు చేసిన అనంతరం నిందితులను గుర్తించి,24 గంటల్లోనే అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఆరు సెల్‌ఫోన్లు, నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

**ఆహారం,వసతి పేరుతో మోసం**

పోలీసుల దర్యాప్తు ప్రకారం.. సెప్టెంబర్ 2, 2026న షేక్ ఆతిఫ్ అనే నిందితుడు టోలిచౌకి నుంచి టీఎస్ 30 టీ 8350 నంబరు గల ఆటోలో మైనర్ బాలికను తీసుకెళ్లాడు. ముందస్తు పథకం ప్రకారం అత్తాపూర్ ప్రాంతానికి తరలించి, సనా అలియాస్ ఆఫ్రీన్,సమ్రీన్ బేగం అనే ఇద్దరు మహిళలకు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

మంచి ఆహారం, వసతి కల్పిస్తామని బాలికను నమ్మించిన ఆ ఇద్దరు మహిళలు, అత్తాపూర్‌లోని పిల్లర్ నంబరు 200 సమీపంలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న సబియా బేగంకు అప్పగించినట్లు పోలీసులు వెల్లడించారు. ఇందుకు ప్రతిఫలంగా రూ.30 వేలు తీసుకుని,ఆ మొత్తాన్ని తమ మధ్య పంచుకున్నట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు.

**బలవంతంగా లైంగిక దోపిడీ**

బాలికను వ్యభిచారంలోకి బలవంతంగా నెట్టినట్లు, ఆమెను విడిచిపెట్టాలని వేడుకున్నప్పటికీ పట్టించుకోకుండా పలువురితో లైంగిక దోపిడీకి గురిచేసినట్లు పోలీసుల వివరాలు వెల్లడిస్తున్నాయి. మరో ముగ్గురు నిందితులు కస్టమర్లను తీసుకురావడం, అవసరమైన వసతులు కల్పించడంలో సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఈ పరిస్థితుల్లో బాధిత బాలిక అక్టోబర్ 5న వ్యభిచార గృహం నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకుంది. తనకు జరిగిన అన్యాయాన్ని కుటుంబ సభ్యులకు వివరించడంతో వారు టోలిచౌకి పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**ఎనిమిది మంది అరెస్ట్.. కొనసాగుతున్న దర్యాప్తు**

ఈ కేసులో షేక్ ఆతిఫ్,సబియా బేగం,మహమ్మద్ హాజీమియా, ఆఫ్రీన్ అలియాస్ సనా,సమ్రీన్ బేగం,ఎండీ నదీమ్,ఎండీ కైఫుద్దీన్,అలీ బిన్ అక్రమ్‌లను అక్టోబర్ 9న అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి ఆరు సెల్‌ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్లతో పాటు పోక్సో చట్టం, అనైతిక రవాణా నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. మైనర్ బాలికలను అక్రమంగా తరలించి లైంగిక దోపిడీకి గురిచేయడం ద్వారా డబ్బు సంపాదించడమే నిందితుల లక్ష్యంగా ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు. నిందితుల పాత్ర, ఆర్థిక లావాదేవీలపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.గోల్కొండ జోన్ డీసీపీ జె. రాఘవేందర్ రెడ్డి పర్యవేక్షణలో, టోలిచౌకి డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫియాజ్ మార్గదర్శకత్వంలో టోలిచౌకి ఇన్‌స్పెక్టర్ ఎల్. రమేష్ నాయక్, అదనపు ఇన్‌స్పెక్టర్ జి. బలరాజ్,ఎస్ఐ ఎస్.రవికుమార్, పోలీసు సిబ్బంది ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించారు.

# దసరా సెలవులకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.. పట్టణ సీఐ సీతారాం..

**8వ వార్డు ఆర్టీసీ కాలనీలో కౌన్సిలర్ సుదీర్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమం**





**షాద్ నగర్,అక్టోబర్ 10,(ప్రజావినికిడి):** పట్టణ ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడంతో పాటు దొంగతనాల నివారణే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా షాద్‌నగర్ పట్టణంలోని 8వ వార్డు ఆర్టీసీ కాలనీలో కౌన్సిలర్ సుదీర్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల వినియోగం, వాటి ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ సీతారాం హాజరై ప్రజలకు పలు సూచనలు చేశారు.

**సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ**

ఇళ్ల వద్ద, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను అరికట్టడంతో పాటు నేరాలకు పాల్పడిన వారిని గుర్తించడం సులభమవుతుందని సీఐ వివరించారు. సీసీ కెమెరాలు కొనుగోలు చేసేటప్పుడు వాటి నాణ్యత, రికార్డింగ్ సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

**దసరా సెలవులకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి**

దసరా సెలవుల సందర్భంగా ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సూచించారు. ఇంటి భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని, పరిసరాల్లో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని తెలిపారు.

**రాత్రివేళ ఐదు పోలీసు బృందాలతో పెట్రోలింగ్**

షాద్‌నగర్ పట్టణంలో రాత్రి వేళల్లో ఐదు పోలీసు బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయని సీఐ వెల్లడించారు. డ్రగ్స్ వినియోగం, చైన్ స్నాచింగ్, దొంగతనాల వంటి నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరం జరిగిన వెంటనే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు సంఘటనకు సంబంధించిన వివరాలు, అందుబాటులో ఉన్న ఆధారాలను అందించాలని వివరించారు.

**ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షిత పట్టణం**

షాద్‌నగర్‌ను మరింత సురక్షిత పట్టణంగా తీర్చిదిద్దడమే ఈ అవగాహన కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని సీఐ తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ తమ ఇళ్లతో పాటు కాలనీల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ అనుమానాస్పద ఘటనలను వెంటనే పోలీసుల దృష్టికి తీసుకువస్తే నేరాల నియంత్రణ మరింత సులభమవుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా కౌన్సిలర్ సుదీర్ మాట్లాడుతూ, నేరాల నియంత్రణ చేపట్టేందుకు పోలీసులకు సహకరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. పట్టణ సీఐ సీతారాం,డిఎస్ ఐ శివారెడ్డి ఆధ్వర్యంలో సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టడం చాలా సంతోషంగా ఉందని, పోలీసుల సూచన మేరకు మనమందరం కాలనీ అభివృద్ధి కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిఎస్ఐ శివారెడ్డి, క్రైమ్ డిపార్ట్మెంట్ కానిస్టేబుల్స్ కరుణాకర్,రాజు,కాలనీ వాసులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

**మారేడ్ పల్లి తహసిల్దార్ మహమ్మద్ అసద్ ఉల్లా ఖాన్**




**తార్నాక,(ప్రజావినికిడి):** తెలంగాణ శాసన మండలి మహబూబ్ నగర్ -రంగారెడ్డి- హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు అర్హత కలిగిన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, మారేడుపల్లి తహసిల్దార్ మహమ్మద్ అసద్ ఉల్లా ఖాన్ విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఫారం-18 మారేడుపల్లి ఎమ్మార్వో కార్యాలయంలో అందుబాటులో ఉందని దాన్ని తీసుకొని నిర్ణీత గడువులోపు దరఖాస్తులను సమర్పించాలని కోరారు. అదేవిధంగా ఆన్లైన్లో కూడా దరఖాస్తు చే సుకునే అవకాశం ఉందన్నారు. అర్హులైన పట్ట భద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని నిర్ణీత గడువులో తమ పేర్లను ఓటరు జాబితా లో నమోదు చేసుకోవాలని కోరారు.

# షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యం

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 19 సంవత్సరాల యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఫిర్యాదు ప్రకారం,మహారాష్ట్రకు చెందిన బాలాజీ బన్సోడే కుమార్తె,వయస్సు19 సంవత్సరాలు,ప్రస్తుతం షాద్‌నగర్ పరిధిలోని రాంపూర్ కాలనీలో కుటుంబంతో నివసిస్తోంది.తను 29-09-2026 ఉదయం సుమారు 10:00 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు.కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో,బంధువుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో షాద్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు.

**అదృశ్యమైన యువతి వివరాలు,:**వయస్సు:19 సంవత్సరాలు,వృత్తి: విద్యార్థినిభాషలుమరాఠీ,హిందీ, **గుర్తింపు/దుస్తులు:**బ్లాక్ కలర్ టాప్,బ్లాక్ కలర్ ప్యాంట్/బ్లాక్ కలర్ బుర్కా,ఎత్తు: సుమారు 4.5 అడుగులు,యువతి ఆచూకీ తెలిసిన వారు లేదా ఆమెను ఎక్కడైనా గుర్తించిన వారు వెంటనే షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

# స్వంత నిధులతో బోరు ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**చౌదరిగూడ,(ప్రజావినికిడి):** జిల్లేడు చౌదరి గూడ మండలం వీరన్నపేట గ్రామంలోని మైనారిటీ వార్డులో త్రాగునీటి సమస్యపై స్థానిక ప్రజలు చేసిన విజ్ఞప్తికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తక్షణమే స్పందించారు.ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి,తన స్వంత నిధులతో బోరు వేయించి తాగునీటి సమస్య పరిష్కారానికి ముందడుగు వేశారు.పదవిలో ఉన్నా..లేకున్నా ప్రజల మధ్యే ఉంటూ,వారి కష్టాల్లో అండగా నిలవడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనం అని ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు పేర్కొన్నారు.ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడమే తన బాధ్యతగా భావించే అంజయ్య యాదవ్ సేవాభావాన్ని స్థానికులు అభినందించారు. ప్రజల అవసరాలను గుర్తించి,వారి విజ్ఞప్తులకు స్పందిస్తూ తన వంతు సహకారం అందించడం ద్వారా ప్రజలకు అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కావలి సుమలత వెంకట్రాములు,వార్డు సభ్యులు సత్యం గౌడ్,కుమ్మరి శేఖర్,గంగంపుత్ర సంఘం అధ్యక్షుడు మురళీ,మండల సీనియర్ నాయకులు ఎం.నర్సిములు, సలీం,బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎండీ జహంగీర్, బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ కావలి నరేష్,వైస్ ప్రెసిడెంట్ రెడ్డి నరేష్,మైనారిటీ ప్రెసిడెంట్ ఎండీ అమీర్,సోహెల్,ఖాజా పాషా,ఐదవ వార్డు ప్రజలు మొకత్యార్,గులాం,దస్తగిరి, రఫీక్,మోసిన్,బురాన్,యూసుఫ్,కుక్కల బాలయ్య, ఉస్మాన్,బురాన్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ చేసి వాహనం నడపవద్దు..

**ఘట్కేసర్ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ బి. శ్రీనయ్య..**



**ఘట్కేసర్,(ప్రజావినికిడి):**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ ట్రాఫిక్ పిఎస్ పరిధి అన్నోజిగూడ లో హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారి పై ట్రాఫిక్ పోలీసులు చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి వాహనదారులను తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా ఘట్కేసర్ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ బి.శ్రీనయ్య మాట్లాడుతూ,మద్యం సేవించి వాహనం నడిపి ప్రమాదాలకు గురై వారి కుటుంబాలను రోడ్డున పడేయ్యవద్దని అన్నారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ట్రాఫిక్ ఇనస్పెక్టర్ శ్రీనయ్య తెలిపారు.

# అమావాస్య సందర్భంగా 750 మందికి అన్నదానం

**నాగార్జున స్కూల్ ఎదుట కామదేవుడు అన్నప్రసాద వితరణ ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ సంయుక్త ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**



**రంగారెడ్డి, అక్టోబర్ 10,(ప్రజావినికిడి):** అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని జై గో మాతా, కామదేవుడు అన్నప్రసాద వితరణ ట్రస్ట్ అదేవిదంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నాగార్జున స్కూల్ ఎదుట అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 750 మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అమావాస్య రోజున ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం, సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ సమాజానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కామదేవుడు అన్నప్రసాద వితరణ ట్రస్ట్ ప్రతినిధులు సంఘమేశు గుప్తా,లింగేశ్ గుప్తా,అలాగే లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ అధ్యక్షుడు, ఎస్ఎన్ కార్ డెకార్స్ యజమాని వెంకటేశ్వర్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు మనీషా సింగ్, కార్యదర్శి ప్రమోద్ సింగ్, క్లబ్ సభ్యులు ఇతర సేవాభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా పలువురు బిఆర్ఎస్ నాయకుల జన్మదిన వేడుకలు..

**ముఖ్య అతిథిగా హాజరైన బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్..**



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని గాజులరామారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, జీడిమెట్ల డివిజన్ సీనియర్ నాయకులు సుధాకర్ గౌడ్ లు తమ పుట్టిన రోజు సందర్భంగా వారి కార్యాలయాల్లో నిర్వహించిన వేడుకల్లో బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు సుధాకర్ గౌడ్ లకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని శంభీపూర్ నుండి మల్లంపేట్ వరకు నూతనంగా నిర్మిస్తున్న రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వీస్ రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, పనుల వివరాలను సంబంధిత అధికారులను ఫోన్లో అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా, రహదారి నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి,నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు అర్కల అనంతస్వామి ముదిరాజ్,విష్ణు వర్ధన్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ కుంట్ల అమర్నాథ్, సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, ధర్మా రెడ్డి,బైండ్ల గోపాల్,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కలుషిత నీటీ సమస్యను పరిశీలించిన కార్పొరేటర్

**అంబర్ పేట్, (ప్రజా వినికిడి):**



అంబర్ పెట్ డివిజన్ ప్రేమ్ నగర్ లోని బేగం అమ్మ గల్లీ, కాలువ గల్లిలో కలుషిత మంచినీటి సమస్యని సంబంధిత అధికారులు సిబ్బందితో కలిసి అంబర్ పెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కలుషిత మంచినీటి సమస్యని పరిశీలించి సిబ్బందిచే సమస్యని పరిష్కరించడం జరిగింది.అలాగే ప్రేమ్ నగర్ ఓల్డ్ ఏజ్ హోమ్ గల్లిలో స్ట్రీట్ లైట్స్ ఆన్ ఆఫ్ బాక్స్ లను కొత్తవి ఏర్పాటు చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. పాడైపోయిన మ్యాన్ హోల్స్ స్థానంలో నూతన మాన్ హోల్స్ దక్కన్ లని ఏర్పాటు చేయాలని సంబంధిత సిబ్బందికి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రంగు సతీష్ గౌడ్,సంతోష్ చారి, వరుణ్,స్థానిక బస్తీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా చంపాపేట్ డివిజన్ పరిధిలోని మాధవ్ నగర్ కాలనీ నందు బతుకమ్మలతో మహిళలు చిన్నారులు.

**:చంపాపేట్(ప్రజావినికిడి)**

# అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉండాలి

## ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్‌నగర్ పట్టణంలోని 7వ, వార్డు ఈశ్వర కాలనీలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జై భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి ఆగమన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

భక్తులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, నవరాత్రుల సందర్భంగా అమ్మవారి ఆగమన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన జై భవానీ యూత్ అసోసియేషన్ నిర్వాహకులను అభినందించారు.ఈకార్యక్రమానికి హాజరైన అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, షాద్‌నగర్ పట్టణం అభివృద్ధి చెందాలని,

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నవరాత్రి దీక్షలు చేపట్టి అమ్మవారిని ఆరాధిస్తున్న భక్తులందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు.

ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు.ఇంత చక్కటి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన జై భవానీ యూత్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు,యువకులు, మహిళలు,కాలనీవాసులకు మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.నవరాత్రి ఉత్సవాలు భక్తి,ఐకమత్యం, ఆధ్యాత్మిక భావనలకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఈశ్వర్ రాజు,రమణయ్యగోపాల్ రెడ్డి,కృష్ణారెడ్డి,వెంకట్ రెడ్డి,శంకర్ నాయక్,బలరాం, అమృతం,హనుమాన్ చారి అన్న,శేఖర్ అప్ప,ప్రసాద్, శివశంకర్ గౌడ్,ఉదయ్ గౌడ్,కృష్ణ ఫోటోగ్రాఫర్, ఉదయ్ గౌడ్, వెంకట్,హరి నాయక్,దీపక్, రవి, కాలనీవాసులు పాల్గొన్నారు.



# పోచమ్మ ఆలయంలో 36 నెలలుగా నిరంతర అన్నదాన సేవ

**ప్రతి అమావాస్యకు అన్నప్రసాద వితరణ.. భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్న భక్తులు**

**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 10:** కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్‌లో కొలువుదీరిన శ్రీ శ్రీ పోచమ్మ అమ్మవారి ఆలయం భక్తుల పూజలతో భక్తిపారవశ్యంతో విరాజిల్లుతోంది. అమ్మవారిపై అపారమైన విశ్వాసంతో స్థానిక భక్తులు గత మూడు సంవత్సరాలుగా ప్రతి అమావాస్య రోజున నిరంతరాయంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారువరుసగా 36 నెలలపాటు కొనసాగుతున్న ఈ అన్నదాన సేవ భక్తుల సహకారంతో దిగ్విజయంగా సాగుతోంది.శ్రీ పోచమ్మ తల్లిని తమ ఇలవేల్పుగా భావించే భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారుప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి దివ్య ఆశీస్సులు సకల జనులపై ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడికి అన్నప్రసాదం అందేలా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ సందర్భంగా కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ,

గత 36 నెలలుగా ప్రతి అమావాస్య రోజున ఎలాంటి విరామం లేకుండా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.ఈ సేవా కార్యక్రమానికి స్థానిక భక్తులతోపాటు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో సహకరిస్తున్నారని తెలిపారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు,



అలంకరణలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దైవభక్తితోపాటు సేవాభావాన్ని చాటిచెప్పే ఈ కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆయన అన్నారు. అమ్మవారి ఆశీస్సులు, భక్తుల సహకారం వల్లే మూడు సంవత్సరాలుగా అన్నదాన సేవను విజయవంతంగా కొనసాగించగలుగుతున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగించడంతోపాటు మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

**దేవి నవరాత్రులకు ప్రత్యేక ఏర్పాట్లు**

రానున్న దేవి నవరాత్రుల సందర్భంగా తొమ్మిది



రోజులపాటు శ్రీ పోచమ్మ అమ్మవారిని వివిధ అవతారాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకోవాలని కోరారు. నవరాత్రుల సందర్భంగా ఆలయంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు గుమ్మడి కుమార్, కిష్టప్ప,బి. వెంకటేష్,కార్మిక శాఖ విభాగ్ అధ్యక్షులు ఉప్పల్ శ్రీను, దేవాలయ కమిటీ అధ్యక్షులు సంట్రింగ్ శంకర్, మల్లేష్,కృష్ణ, బొంబాయి రవి, బుచ్చయ్య, కార్తీక్,ఆనంద్, భాగ్యమ్మ, కుమార్,జగన్, శేఖర్,లక్ష్మణ్, మధు చారితోపాటు స్థానిక ప్రముఖులు, మహిళలు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# పల్లెల్లో ప్రారంమైన బతుకమ్మ సంబరాలు

**వాజేడు,అక్టోబర్ 11,(ప్రజావినికిడి):**

మండలంలోని గ్రామాలలో బతుకమ్మ సంబరాలు శనివారం అమావాస్య రోజు ఎంగిలిపూల బతుకమ్మ తో మొదలై సద్దుల బతుకమ్మ వరకు ఈ బతకమ్మ సంబరాలు గ్రామ గ్రామాన జరగనున్నాయి కొన్ని గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి ఇంటింటికి బతుకమ్మలు పేర్చి మహిళలు పిల్లలు బతుకమ్మ పాటలతో సంబరాలు జరిగాయి..ఈ బతుకమ్మ మొదటి రోజు కావడంతో అధికంగా యువతులు పిల్లలు అధికంగా పాల్గొని బతుకమ్మ పాటలతో ఓరెత్తించారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# సర్ పేరుతో అర్హులైన ఓటర్ల తొలగింపుపై నిరసన..

## ప్రజాస్వామ్య గొంతుకపై ఉక్కుపాదం.. ఇది పాలనా.? లేక అప్రకటిత ఎమర్జెన్సీనా.?!

**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
ఆనాడు కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీ..నేడు బీజేపీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు..
ఆనాడు కాంగ్రెస్ పార్టీ దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తే,నేడు బీజేపీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను సృష్టిస్తూ, ప్రతిపక్షాల గొంతును నొక్కుతూ,ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఓటర్ల పేర్లను అనైతికంగా తొలగిస్తోందనే ఆరోపణలు ప్రజాస్వామ్యంపై ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి.
ప్రజాస్వామ్య పరిరక్షణ,ఓటు హక్కు సంరక్షణ లక్ష్యంగా దేశవ్యాప్తంగా ఓటు చోరీ,ఓటర్ల జాబితాలో అక్రమాలపై వ్యక్తమవుతున్న ఆందోళనలకు మద్దతుగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

**సర్ పేరుతో అర్హులైన ఓటర్ల తొలగింపుపై నిరసన**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియ పేరుతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అర్హులైన ఓటర్ల పేర్లు పెద్దఎత్తున తొలగిస్తున్నారనే ఆరోపణలపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి, జవాబుదారీతనం పాటించాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యానికి గుండెకాయ లాంటి భావవ్యక్తీకరణ స్వేచ్ఛను అణచివేస్తూ, ప్రశ్నించే గొంతులకు సంకెళ్లు వేస్తూ, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను నిర్బంధిస్తున్న చర్యలను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్రంగా ఖండిస్తోంది.గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఓటింగ్ ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో,"ా× సాంకేతికతను ఉపయోగించి ప్రతిపక్షాల ఓట్లను లక్ష్యంగా చేసుకుని,సర్ ప్రక్రియ ద్వారా మోదీ ప్రభుత్వం అక్రమంగా ఓటర్ల పేర్లను తొలగిస్తోందనే ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.





**నిరసన హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం**

దేశ రాజధానిలో నిర్బంధ వాతావరణం నెలకొన్నట్లుగా సాగుతున్న చర్యలు ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.57 మెట్రో స్టేషన్లను మూసివేయడం, సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకున్న తర్వాత కూడా 40 స్టేషన్లలో రాకపోకలకు అంతరాయం కలగడం,నార్తర్న్ రైల్వే పరిధిలో 38 రైళ్లను రద్దు చేయడం వంటి పరిణామాలతో సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారనే అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి.
దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులను, ప్రయాణికులను ఇటార్సీ-భోపాల్ స్టేషన్ల వద్ద అడ్డుకోవడం, తెలంగాణ నుంచి తమ హక్కుల కోసం తరలివెళ్లిన విద్యార్థులను భోపాల్‌లో నిర్బంధించడం వంటి చర్యలు శాంతియుత నిరసన తెలిపే హక్కుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.ఈ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని అన్నారు.అరెస్టు చేసిన విద్యార్థులను వారి వారి రాష్ట్రాలకు క్షేమంగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.బిజెపి ఫేక్ మీడియా ద్వారా దేశద్రోహులని,
పాకిస్తాన్ గూడచారులని,చైనా గూడచారులని,జార్జ్ సోరస్ మనిషి అనే ముద్రలు వేసే ప్రయత్నం మీ ఫేక్ మీడియా ద్వారా చేయకండి.మీరు గత 12 సంవత్సరాలుగా చేస్తున్న ప్రయత్నాలు ఇవన్నీ.ఒక శాంతియుత ప్రజాస్వామ్య నిరసనను అడ్డుకోవడానికి వేలాది మంది పోలీసులను మోహరించాల్సిన అవసరం ఏమిటి? ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పాలకులు,ప్రజల గొంతులను అణచివేయడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారు.? ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కును గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై లేదా?

**ఎమర్జెన్సీ చరిత్రను గుర్తుచేస్తున్న ప్రస్తుత పరిణామాలు**

1975లో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ దేశ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచిపోయింది. నేడు ప్రజల హక్కులను అడ్డుకునే చర్యలు కొనసాగితే,అవి మరోసారి అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులను తలపిస్తాయి. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే నిరంకుశ పోకడలనైనా బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుంది.

**ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలి**

ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇవ్వాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఈ ధర్నా ద్వారా బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.
పాలకులు గుర్తుంచుకోవాలినిర్బంధాలతో ప్రజాగ్రహాన్ని ఆపలేరు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, శాంతియుత నిరసన,ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదులు. ప్రజల హక్కులను కాపాడటం, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం కోసం బీఆర్ఎస్ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుంది.ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు,మహిళలు,కార్యకర్తలు పాల్గొని ఓటు హక్కు పరిరక్షణకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# పుప్పలగూడలో వైభవంగా బతుకమ్మ సంబరాలు

## మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొన్న: ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్





**గండిపేట్, అక్టోబర్ 10, (ప్రజావినికిడి)**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు పుప్పలగూడలోని హాల్మార్క్ ఎంపీరియన్ గేటెడ్ కమ్యూనిటీలో శుక్రవారం వైభవంగా జరిగాయి.ఈ వేడుకలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ చేరి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. పూల పరిమళాలు, మహిళల కోలాహలం, ఆటపాటలతో కమ్యూనిటీలో పండుగ వాతావరణం నెలకొంది.చిన్నా పెద్దా తేడా లేకుండా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో ముడిపడిన సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందన్నారుఇలాంటి సామూహిక వేడుకలు మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతోపాటు కుటుంబాలు, సమాజం మధ్య ఆత్మీయ అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ వేడుకలను ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేశ్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, శ్రీ రామకృష్ణారెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు, కమ్యూనిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## సౌదీలో భారతీయులకు 24 గంటల హెల్ప్‌లైన్ ఏర్పాటు



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** సౌదీ అరేబియాలో భద్రతా పరిస్థితుల నేపథ్యంలో అక్కడ నివసిస్తున్న భారతీయులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర సూచనలు జారీ చేసింది.ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరింది.సౌదీ అరేబియాలో జరుగుతున్న పరిణామాలు, సైనిక కార్యకలాపాలు, పేలుళ్లకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, ధృవీకరించని వార్తలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడం లేదా తిరిగి ప్రచారం చేయడం మానుకోవాలని సూచించింది. ప్రాంతీయ శాంతి, భద్రతలకు ఇవి ముప్పుగా పేర్కొంది.సౌదీలో నివసిస్తున్న భారతీయులకు అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించేందుకు ప్రవాసీ భారతీయ సహాయత కేంద్రం ద్వారా 24 గంటల హెల్ప్‌లైన్ సేవలను అందుబాటులో ఉంచినట్లు రాయబార కార్యాలయం వెల్లడించింది. భారత విదేశాంగ శాఖ,భారత రాయబార కార్యాలయం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని తెలిపింది.సౌదీలో నివసిస్తున్న భారతీయులు భద్రతా సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ, అత్యవసర సహాయం అవసరమైనప్పుడు హెల్ప్‌లైన్ 8002471234 ఈ నంబర్‌ను సంప్రదించాలని రాయబార కార్యాలయం కోరింది.

# 14న మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్

**19న మండల, జడ్పీ ఎన్నికల షెడ్యూల్**

**వచ్చే నెలలో పంచాయతీ పోరు 3 దశల్లో నిర్వహణకు కసరత్తు**

**13న గుర్తింపు పొందిన 20 రాజకీయ పార్టీలతో ఎస్ఈసీ సమావేశం**

**అక్టోబర్ 10(ప్రజావినికిడి):**
రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన శనివారం క్యాబినెట్ ప్రత్యేకంగా సమావేశమైంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు నిర్ధారించేందుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏర్పాటైన స్వతంత్ర కమిషన్ చేసిన సిఫారసులను మంత్రివర్గం ఆమోదించింది. గ్రామాల్లో వార్డు సభ్యుల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జడ్పీ చైర్‌పర్సన్లు, మున్సిపల్ వార్డు సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్ల వరకూ బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసింది. మరోవైపు ఈ నెల 13న రాష్ట్రంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం సమావేశమై స్థానిక ఎన్నికల నిర్వహణపై చర్చించనుంది. ఈ భేటీ అనంతరం 14న మున్సిపల్, 19న ప్రాదేశిక ఎన్నికలకు నోటిఫికేషన్‌తో పాటు షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. నవంబరులో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.



**ఎన్నికల సంఘం సిద్ధం**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. 13న అన్ని రాజకీయ పార్టీలతో సమావేశమైన అనంతరం 14న మున్సిపల్ ఎన్నికలకు, 19న జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల చేయనుంది. ఈ నెలాఖరు నాటికి మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియను ముగించాలని నిర్ణయించింది. అలాగే నవంబరు 10 నుంచి 15వ తేదీ మధ్యలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల కానుంది. పంచాయతీలకు మూడు రోజుల వ్యవధిలో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని ఎస్ఈసీ నిర్ణయించింది. నవంబరు చివరి నాటికి మొత్తం పంచాయతీలకు ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. డిసెంబరు మొదటి నుంచి రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థలకు కొత్త పాలక వర్గాలు ఏర్పాటు కానున్నాయి.ఈ షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో దాదాపు రెండు నెలల పాటు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది.
మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లు, ఇతర అంశాలపై వివరించేందుకు 13న గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలను రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశానికి ఆహ్వానించింది. విజయవాడలోని ఎస్ఈసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు ఈ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో 20 పార్టీలకు గుర్తింపు ఉండటంతో ఆయా పార్టీల అధినేతలకు ఆహ్వానపత్రాలను ఎస్ఈసీ అందించింది. పార్టీ అధ్యక్షులు లేదా పార్టీ గుర్తించిన ప్రతినిధులు సమావేశంలో పాల్గొనేందుకు వెసులుబాటు కల్పించింది.

# మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం.. బావిలో తల్లి, ఇద్దరు పిల్లల మృతదేహాలు

**మహబూబాబాద్ (ప్రజావినికిడి):**
మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర విషాదకరమైన ఘటన చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు చిన్నారులతో సహా వ్యవసాయ బావిలో విగతజీవిగా కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. ఈ హృదయ విదారక సంఘటన శనివారం కురవి మండలంలో వెలుగుచూసింది.



వివరాల్లోకి వెళితే.. కురవి మండలానికి చెందిన బానోతు అనూష(26)కు కుమార్తె వర్షిణి (9), కుమారుడు విశాల్ కృష్ణ (4) ఉన్నారు. శనివారం సాయంత్రం అయినా అనూష తన పిల్లలతో ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చుట్టుపక్క ప్రాంతాల్లో గాలించగా, తండా శివార్లలోని ఓ వ్యవసాయ బావిలో అనూష, ఆమె ఇద్దరు పిల్లల మృతదేహాలు కనిపించాయి. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో మృతదేహాలను బావిలో నుంచి వెలికితీశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ముగ్గురి మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు విచారణ జరుపుతున్నారు. కుటుంబ కలహాలు ఏమైనా ఉన్నాయా లేదా ఇది ప్రమాదవశాత్తు జరిగిందా అనే కోణంలో ఆరా తీస్తున్నారు.ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఇలా అనుమానాస్పద స్థితిలో మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసుల దర్యాప్తు పూర్తయితే గానీ ఈ ఘటన వెనుక ఉన్న అసలు కారణాలు తెలిసే అవకాశం లేదు.

# ఆఫ్రికా చెల్లింపుల వ్యవస్థలో యూపీఐ..

**భారత్‌తో జింబాబ్వే చర్చలు**

**ఆఫ్రికా చెల్లింపుల వ్యవస్థను మార్చేందుకు జింబాబ్వే ప్రయత్నాలు**

**భారత యూపీఐ టెక్నాలజీ కోసం ఎన్‌పీసీఐతో చర్చలు**

**తక్కువ ఖర్చుతో వేగవంతమైన లావాదేవీలే ప్రధాన లక్ష్యం**

**అక్టోబర్ 31 నాటికి ఒప్పందం ఖరారయ్యే అవకాశం**

**ఇప్పటికే పలు ఆఫ్రికా దేశాలు యూపీఐపై ఆసక్తి**

**అక్టోబర్ 10 (ప్రజావినికిడి):**
భారత్ అభివృద్ధి చేసిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సాంకేతికత అంతర్జాతీయ స్థాయిలో విశేష ఆదరణ పొందుతోంది. తాజాగా ఆఫ్రికా దేశమైన జింబాబ్వే తమ దేశ చెల్లింపుల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు యూపీఐ సాంకేతికతను వినియోగించుకోవడంపై భారత్‌తో చర్చలు జరుపుతోంది. ఈ మేరకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అంతర్జాతీయ విభాగమైన ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్)తో జింబాబ్వే సంప్రదింపులు జరుపుతున్నట్లు ఒక నివేదిక వెల్లడించింది.

ఈ ఒప్పందం కార్యరూపం దాల్చితే, జింబాబ్వేలోని బ్యాంకులు, మొబైల్ మనీ ఆపరేటర్లు, ఫిన్‌టెక్ సంస్థలు ఒకే వేదికపైకి వచ్చి రియల్ టైమ్ చెల్లింపులు జరిపేందుకు వీలు కలుగుతుంది. దీనివల్ల లావాదేవీల వ్యయం గణనీయంగా తగ్గడమే కాకుండా, నగదు బదిలీల వేగం కూడా పెరుగుతుందని జింబాబ్వే రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ జాన్ ముషయవాన్హు ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్న మొత్తాల దేశీయ లావాదేవీలకు డెబిట్, క్రెడిట్ కార్డులకు ప్రత్యామ్నాయంగా ఇది నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్ఐపీఎల్‌తో సాగుతున్న ఈ చర్చలు ఈ ఏడాది అక్టోబర్ 31 నాటికి ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం జింబాబ్వేలో డిజిటల్ లావాదేవీల సంఖ్య గణనీయంగానే ఉంది. 2025 నాలుగో త్రైమాసికంలో దేశవ్యాప్తంగా 238 మిలియన్ల ఎలక్ట్రానిక్ లావాదేవీలు నమోదు కాగా, వాటిలో 87 శాతం మొబైల్ మనీ ద్వారానే జరిగాయి. అయినప్పటికీ, ఈ లావాదేవీలకయ్యే ఖర్చు అధికంగా ఉంటోంది. ముఖ్యంగా విదేశాల నుంచి పంపే నిధులపై భారీగా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం, 2025లో ఆఫ్రికా దేశాలకు 200 డాలర్లు పంపడానికి సగటున 8 శాతం ఖర్చు అవుతుండగా, ప్రపంచ సగటు 6.5 శాతంగా ఉంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రకారం ఈ వ్యయం 3 శాతానికి మించకూడదు. యూపీఐ వంటి వ్యవస్థ అందుబాటులోకి వస్తే ఈ ఖర్చులు తగ్గి, మధ్యవర్తుల దోపిడీకి అడ్డుకట్ట పడనుంది. భారత యూపీఐ టెక్నాలజీ 2025 నాటికి ప్రపంచంలోని మొత్తం రియల్ టైమ్ లావాదేవీలలో 49 శాతం వాటాను కలిగి ఉండటం దాని సామర్థ్యానికి నిదర్శనం. జింబాబ్వేతో పాటు ఘనా, ఉగాండా, రువాండా, మొజాంబిక్ వంటి ఇతర ఆఫ్రికా దేశాలు కూడా యూపీఐ టెక్నాలజీపై ఆసక్తి కనబరుస్తున్నాయి. ఈ దేశాలు యూపీఐని స్వీకరిస్తే, మిగతా ఆఫ్రికా దేశాలకు ఇవే ప్రమాణాలుగా మారే అవకాశం ఉంది.

# ఢిల్లీని పాకిస్థాన్‌కు అప్పగించారా?

## : కేంద్రంపై నారాయణ తీవ్ర ఆగ్రహం



**అక్టోబర్ 10 (ప్రజావినికిడి):**
సీపీఐ సీనియర్ నేత నారాయణ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో పూర్తిస్థాయి లాక్‌డౌన్ విధించారని, ఇంతకీ ఢిల్లీని పాకిస్థాన్‌కు ఏమైనా అప్పగించారా అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వచ్చిన వారిని అణచివేసేందుకు 50 వేల నుంచి 75 వేల మంది పోలీసు, ఇతర భద్రతా సిబ్బందిని మోహరించి సాధారణ జనజీవనాన్ని స్తంభింపజేయడం అన్యాయమని అన్నారు. కేంద్రం తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్రం పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారైందని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలపై న్యాయ నిపుణులు, సుప్రీంకోర్టు కూడా స్పందిస్తున్నాయని గుర్తుచేశారు. ఇదే సమయంలో, తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్ విజయం సాధించడంపై నారాయణ సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఈ ఎన్నికలను కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా రాజకీయ పోటీగా మార్చిన కాంగ్రెస్ పార్టీపై ఆయన విమర్శలు గుప్పించారు. అధికార అహంకారంతో కమ్యూనిస్టులను ఓడించాలని పిలుపునివ్వడం సరికాదన్నారు. ప్రజల ఉద్యమాలను అణచివేతతో ఆపలేరని, కేంద్రం తన తప్పులను సరిదిద్దుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు

# జియోతో డేటా ధరలు తగ్గాయి

## స్టార్‌లింక్ వివాదం.. మస్క్‌కు వెంబు దిమ్మతిరిగే సమాధానం!

**అమెరికాలో చైనా ఈవీల నుంచి టెస్లాకు రక్షణ లభిస్తోందని వ్యాఖ్య**

**భారత స్టార్టప్‌లు తక్కువ ధరతో రాకెట్లు తయారు చేస్తున్నాయని వెల్లడి**

**ఇవి స్పేస్‌ఎక్స్‌కు పోటీ ఇస్తాయని వ్యాఖ్య**



**అక్టోబర్ 10 (ప్రజావినికిడి):**
టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్‌కు జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు గట్టిగా బదులిచ్చారు. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీని ఉద్దేశించి మస్క్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలపై స్పందిస్తూ.. భారత్‌లో తక్కువ ధరలకే మొబైల్ డేటా, మందులు, డిజిటల్ చెల్లింపులు అందుబాటులో ఉన్నాయని గుర్తుచేశారు. ఇవన్నీ సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. 'ఇవిగో నిజాలు ఎలాన్' అంటూ 'ఎక్స్' వేదికగా మస్క్ విమర్శలకు సమాధానమిచ్చారు.

భారత్‌లో మొబైల్ డేటా ధరలు తగ్గడంలో అంబానీ తీసుకొచ్చిన జియో కీలక పాత్ర పోషించిందని వెంబు పేర్కొన్నారు. దేశంలో ప్రయాణించేటప్పుడు స్థానిక వైఫైకి బదులుగా తన ఫోన్ డేటానే ఎక్కువగా ఉపయోగిస్తానని చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ డేటా లభిస్తుండటంతో చాలామంది రెండు సిమ్‌లు వాడుతున్నారని వివరించారు.

అమెరికా మార్కెట్ విషయంలోనూ వెంబు మస్క్‌ను ప్రశ్నించారు. చైనా ఎలక్ట్రిక్ వాహనాల పోటీ నుంచి అమెరికా మార్కెట్‌లో టెస్లాకు రక్షణ లభిస్తోందని అభిప్రాయపడ్డారు. పోటీ ఎక్కువగా ఉంటే అమెరికాలో ఎలక్ట్రిక్ కార్ల ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని అన్నారు. భారత్‌లో సామాన్యులకు తక్కువ ధరలకు సేవలు అందేలా పోటీతో కూడిన ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. భారత స్టార్టప్‌లు తక్కువ ఖర్చుతో రాకెట్లు తయారు చేసే దిశగా సాధిస్తున్న పురోగతిని కూడా ప్రస్తావించారు. భవిష్యత్తులో ఇవి స్పేస్‌ఎక్స్‌కు పోటీగా మారే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

అసలు మస్క్ ఎందుకు అంబానీపై విమర్శలు చేశారు? భారత్‌లో స్టార్‌లింక్ సేవల ప్రారంభానికి అనుమతుల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వివాదం మొదలైంది. 'భారత్‌కు నిజమైన బాస్ అంబానీ అని తెలియదు.. క్షమించండి' అంటూ మస్క్ వ్యంగ్యంగా పోస్ట్ చేశారు. స్టార్‌లింక్ ను అడ్డుకుని గుత్తాధిపత్యాన్ని కొనసాగించాలని అంబానీ భావిస్తున్నారని ఆరోపించారు.

మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ అందించడం, ప్రకృతి విపత్తుల సమయంలో కమ్యూనికేషన్ సేవలను పునరుద్ధరించడం ద్వారా స్టార్‌లింక్ ఉపయోగపడుతుందని మస్క్ వాదించారు. అయితే భారత్‌లో వాణిజ్య సేవలు ప్రారంభించేందుకు స్టార్‌లింక్ ఇంకా కొన్ని నియంత్రణపరమైన అనుమతులు పొందాల్సి ఉంది.

ఇదిలా ఉంటే, జియో కూడా ఉపగ్రహ ఇంటర్నెట్ రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. భారత్ మొబైల్ కాంగ్రెస్ 2026లో సుమారు 1,600 లో-ఎర్త్ ఆర్బిట్ ఉపగ్రహాలు, 23 గ్రౌండ్ స్టేషన్లతో సేవలు అందించే ప్రణాళికను ప్రకటించింది. మారుమూల గ్రామాలు, ద్వీపాలు, సరిహద్దు ప్రాంతాలకు ఇంటర్నెట్ అందించడం దీని లక్ష్యం. స్టార్‌లింక్, జియోతో పాటు భారతీ ఎయిర్‌టెల్ మద్దతున్న యూటెల్‌శాట్ వన్‌వెబ్ కూడా అనుమతుల ప్రక్రియలో ఉన్నాయని భారత ప్రభుత్వం తెలిపింది.

# తిరుమల శ్రీవారికి జైపూర్ దంపతుల ఖరీదైన కానుక..

## మరో దాత భారీ విరాళం





**తిరుమల అక్టోబర్ 10(ప్రజావినికిడి)::**
తిరుమల శ్రీవారికి భారీగా విరాళాలు, కానుకలు అందాయి. భక్తులు స్వామివారికి విలువైన ఆభరణాలతో పాటు టీటీడీ నిర్వహిస్తున్న ట్రస్ట్‌కు నగదు రూపంలో విరాళాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన ఆర్తి బిందాల్ దంపతులు శ్రీవారికి రూ. 51.55 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను విరాళంగా అందించారు. ఇందులో వజ్రాలు, రత్నాలు పొదిగిన 147 గ్రాముల బంగారు లాకెట్, వజ్రాలు, కెంపులు పొదిగిన 27 గ్రాముల మూడు వరుసల ముత్యాల హారం ఉన్నాయి. ఈ ఆభరణాలను ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు దాతలు స్వయంగా అందజేశారు. ఉత్సవమూర్తుల అలంకరణకు వీటిని వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న 'బర్డ్' ట్రస్ట్‌కు కూడా భారీ విరాళం అందింది. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన దాత హర్షవర్ధన్ రెడ్డి రూ. 10 లక్షలు విరాళంగా ఇచ్చారు. హర్షవర్ధన్ రెడ్డి తరఫున టీటీడీ పాలకమండలి సభ్యుడు నన్నపనేని సదాశివరావు ఈ డీడీని ఛైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు. టీటీడీ సేవా కార్యక్రమాలకు అండగా నిలుస్తున్న దాత హర్షవర్ధన్ రెడ్డికి ఛైర్మన్ బీఆర్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

# సీపీఎం నేత ఎంఏ గఫూర్‌కు పుత్రశోకం..

## అమెరికాలో కుమారుడి మృతి



**అక్టోబర్ 10(ప్రజావినికిడి):**
సీపీఎం సీనియర్ నేత, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ ఇంట్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన కుమారుడు పీవీ కిరణ్ (41) అమెరికాలోని కాలిఫోర్నియాలో గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కిరణ్ మృతితో ఆయన కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. వివరాల ప్రకారం, అక్టోబర్ 2వ తేదీన కిరణ్ నిద్రలోనే గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆ రోజు ఆయన ఆఫీస్‌కు వెళ్లకపోవడం, ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడంతో అనుమానం వచ్చిన సహోద్యోగులు, స్నేహితులు ఆయన అపార్ట్‌మెంట్‌కు వెళ్లి చూడగా, అప్పటికే మరణించి ఉన్నారు. వారు వెంటనే స్థానిక పోలీసులకు, కర్నూలులోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కిరణ్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి నాలుగు నుంచి ఐదు రోజులు పట్టవచ్చని తెలుస్తోంది. కిరణ్ మరణ వార్త తెలియగానే పలు రాజకీయ పార్టీల నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కర్నూలులోని గఫూర్ నివాసానికి సీపీఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆయన కుటుంబాన్ని పరామర్శిస్తున్నారు.

# బాబు పవన్ విజయ్ ఒకే ఫ్రేమ్?

## ఏపీకి తమిళనాడుకు మధ్య నెలకొన్న జల వివాదాలను పరిష్కరించుకునే నిమిత్తం ఏపీకి విజయ్




**అక్టోబర్ 10(ప్రజావినికిడి):**
తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత విజయ్ తొలిసారి ఏపీకి అధికార పర్యటనకు వస్తున్నారు. ఆయన ఈ నెల 13న విజయవాడ టూర్ ఫిక్స్ అయిందని అంటున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఏపీ సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో భేటీ అవుతారు అని తెలుస్తోంది. ముఖ్యంగా తెలుగు గంగ ఒప్పందం గురించి ఆయన కూటమి ప్రభుత్వంలో చర్చిస్తారు అని అంటున్నారు. అలాగే కృష్ణా జలాల వాటా గురించి చర్చ కూడా ఈ భేటీలో జరగనుంది అని అంటున్నారు.

ఏపీకి తమిళనాడుకు మధ్య నెలకొన్న జల వివాదాలను పరిష్కరించుకునే నిమిత్తం విజయ్ ఏపీకి వస్తున్నారు అని అంటున్నారు. తెలుగు గంగ ప్రాజెక్ట్ ద్వారా తమిళనాడుకు నీటిని సరఫరా చేసే ఒప్పందం గతంలో కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ఏపీ నుంచి ప్రతీ ఏడాది 12 టీఎంసీల క్రిష్ణా జలాల నీటిని తమిళనాడుకు అందించాల్సి ఉంది. అయితే ఆ ఒప్పందం సక్రమంగా అమలు కావడం లేదన్నది తమిళనాడు అభ్యంతరంగా ఉంది. ఈ ఏడాది చూస్తే అక్టోబర్ 9 నాటికి కేవలం 2.251 టీఎంసీల నీరు మాత్రమే అందిందని చెబుతున్నారు. ఇంకా 9.749 టీఎంసీల నీరు తమిళనాడుకు సరఫరా కావాల్సి ఉంది. దాంతో తమకు ఒప్పందం మేరకు రావాల్సిన పూర్తి వాటా 12 టీఎంసీల నీటి కోసం తమిళ సీఎం విజయ్ ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చిస్తారు అని అంటున్నారు. డ్యాముల నిర్మాణం మీద : అంతే కాకుండా ఏపీ నుంచి తమిళనాడులోకి ప్రవహించే నదుల మీద ఏపీ ప్రభుత్వం డ్యాముల నిర్మాణం చేసేందుకు సిద్ధపడుతోంది అన్న దానిమీద కూడా తమిళనాడు ప్రభుత్వం అభ్యంతరం తెలియచేస్తోంది. ఈ విషయం మీద ముఖా ముఖీ చర్చల ద్వారా ఏపీ ప్రభుత్వంతో ఒక పరిష్కారం కనుగొనాలని విజయ్ చూస్తున్నారు అని అంటున్నారు. ఇక ఏపీ సీఎం చంద్రబాబు తరచూ ఒక మాట అంటున్నారు. కేంద్రం వద్ద కూడా ప్రతిపాదిస్తున్నారు. అదే నదుల అనుసంధానం. గోదావరి కావేరి సహా దక్షిణాది నదులు అన్నీ కూడా ఏకీకృతం చేస్తే కనుక దక్షిణాదిన అతి పెద్ద వాటర్ గ్రిడ్ ఏర్పడుతుందని శాశ్వతంగా అన్ని రాష్ట్రాలకు నీటి కొరత తీరుతుందని కూడా బాబు చెబుతున్నారు. దీని మీద కూడా విజయ్ ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చిస్తారు అని అంటున్నారు. ఏపీ తమిళనాడు ముఖ్యమంత్రుల మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరుగుతుందని ఈ సందర్భంగా అనేక అంతర రాష్ట్ర సమస్యలకు పరిష్కారం లభిస్తుంది అని భావిస్తున్నారు. అంతే కాదు రెండు రాష్ట్రాల మధ్య సానుకూల వైఖరితో పాటు మంచి సంబంధాలు నెలకొనేందుకు ఆస్కారం ఉంటుందని అంటున్నారు.

ఇదిలా ఉంటే ఏపీకి వస్తున్న విజయ్ ఉప ముఖ్యమంత్రి పవన్ తో తొలి భేటీ వేస్తారు అని అంటున్నారు. చంద్రబాబు ఈ మధ్య దక్షిణాది రాష్ట్రాల సమావేశం చెన్నైలో జరిగినపుడు వెళ్ళారు. అక్కడ అలా విజయ్ ని ఆయన కలుసుకున్నారు. పవన్ తో విజయ్ భేటీ అయితే జరగలేదు. దాంతో ఈసారి ఈ ఇద్దరూ కలసి ఒకే ఫ్రేమ్ లో కనిపిస్తారు అని అంటున్నారు. ఈ ఇద్దరికీ ఒక పోలిక ఉంది. సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చి ఒకరు ముఖ్యమంత్రిగా మరొకరు ఉప ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు. దాంతో ఈ నెల 13న విజయ్ జరిపే అధికారిక పర్యటన మీద అందరి కళ్లూ ఉన్నాయి.

# బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లపై గంభీర్ అసంతృప్తి!



- బంతికి, బ్యాట్‌కు మధ్య సమాన పోటీ ఉండాలి.. బౌలర్ల కెరీర్‌లు కూడా ముఖ్యమే

**రాంచీ, అక్టోబర్ 10:** భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య రాంచీలో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో టీమిండియా ఓటమి నేపథ్యంలో పిచ్ స్వభావంపై భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. బ్యాటర్లకు మాత్రమే అనుకూలంగా ఉండే పిచ్‌లతో క్రికెట్‌లో బంతికి, బ్యాట్‌కు మధ్య సమతుల్యత దెబ్బతింటోందని అభిప్రాయపడ్డాడు. ఇలాంటి పరిస్థితుల్లో బౌలర్లు తీవ్రంగా శ్రమించినప్పటికీ ఆశించిన ఫలితాలు సాధించడం కష్టమవుతోందని పేర్కొన్నాడు.రాంచీలో జరిగిన రెండో టీ20లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఐదు వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. అయితే భారీ లక్ష్యాన్ని కాపాడుకోవడంలో భారత బౌలర్లు విఫలమయ్యారు. వెస్టిండీస్ జట్టు 19 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల బ్యాటర్లు భారీగా పరుగులు సాధించగా, బౌలర్లు పరుగులు నియంత్రించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.మ్యాచ్ అనంతరం గంభీర్ మాట్లాడుతూ.. బ్యాట్‌కు, బంతికి మధ్య సమాన పోటీ ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారని తెలిపాడు. కేవలం ఫోర్లు, సిక్సర్లు మాత్రమే కనిపించేలా కాకుండా బౌలర్లకూ అవకాశాలు కల్పించే పిచ్‌లు ఉండాలని అభిప్రాయపడ్డాడు. జాతీయ జట్టులో స్థానం సంపాదించేందుకు బౌలర్లు ఎంతో కష్టపడతారని, వారి శ్రమకు తగిన గుర్తింపు లభించేలా ఆట పరిస్థితులు ఉండాలని పేర్కొన్నాడు. బౌలర్ల కెరీర్‌లు కూడా ముఖ్యమేనని, సమతుల్యమైన పోటీ ఉన్నప్పుడే మెరుగైన క్రికెట్‌ను చూడగలమని స్పష్టం చేశాడు.అయితే ఓటమికి పిచ్‌ను మాత్రమే కారణంగా చూపలేమని గంభీర్ పేర్కొన్నాడు. భారీ లక్ష్యాన్ని కాపాడుకోవడంలో తమ జట్టు విఫలమైందని అంగీకరించాడు. వెస్టిండీస్ బ్యాటర్లు అద్భుతంగా ఆడారని ప్రశంసిస్తూ, ఇలాంటి పరిస్థితుల్లోనూ ప్రత్యర్థిని ఎలా నిలువరించాలో తమ జట్టు నేర్చుకోవాల్సి ఉందని తెలిపాడు. జట్టు ప్రదర్శనను మెరుగుపరుచుకునేందుకు కృషి కొనసాగిస్తామని పేర్కొన్నాడు.

బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లు, మంచు ప్రభావం బౌలర్లకు సవాళ్లు విసురుతున్న నేపథ్యంలో గంభీర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. క్రికెట్‌లో ఉత్కంఠ పెరగాలంటే బ్యాటర్లతో పాటు బౌలర్లకూ సమాన అవకాశాలు లభించాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశాడు.

# రెన్‌షా వీరోచిత ఇన్నింగ్స్.. ఆసీస్‌కు భారీ స్కోరు!

- 397 బంతుల్లో 190 పరుగులు..

దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో ఆస్ట్రేలియా 390 ఆలౌట్



డర్బన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా బ్యాటర్ మ్యాట్ రెన్‌షా అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఆస్ట్రేలియా 124 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన సమయంలో క్రీజులో నిలదొక్కుకున్న రెన్‌షా, జట్టును ఆదుకున్నాడు. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (43)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పి స్కోరును పెంచాడు.రెండో రోజు కూడా పట్టుదలగా బ్యాటింగ్ చేసిన రెన్‌షా సెంచరీతోపాటు 150 పరుగుల మైలురాయిని దాటాడు. నాథన్ లయన్‌తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 134 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. మొత్తం 397 బంతులు ఎదుర్కొని 190 పరుగులు చేసిన రెన్‌షా చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో ఆస్ట్రేలియా 137.2 ఓవర్లలో 390 పరుగులకు ఆలౌటైంది.దక్షిణాఫ్రికా బౌలర్లలో ముల్డర్ నాలుగు వికెట్లు, యాన్సెన్ మూడు, నోర్జే రెండు వికెట్లు పడగొట్టారు. రెన్‌షా కెరీర్‌లోనే అత్యుత్తమ టెస్టు స్కోరుతో ఆస్ట్రేలియాకు తొలి ఇన్నింగ్స్‌లో గౌరవప్రదమైన స్కోరు అందించాడు.

# ఎలాన్ మస్క్‌పై వెంకటేశ్ ప్రసాద్ ఘాటు విమర్శలు!

## టెస్లా ప్రయోజనాల కోసం బీవైడీని అడ్డుకున్నారు.. భారత్ జాతీయ భద్రతపై నీతులు చెబుతున్నారు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:** ప్రముఖ వ్యాపారవేత్త, ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్‌పై భారత మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్ తీవ్ర విమర్శలు చేశారు. భారత్‌లో స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు అనుమతుల విషయంలో మస్క్ చేసిన వ్యాఖ్యలపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. తన వ్యాపార ప్రయోజనాలకు అనుగుణంగా మస్క్ వ్యవహరిస్తున్నా రని విమర్శించారు.తన టెస్లా కార్ల అమ్మకాలు తగ్గుతాయనే భయంతో చైనాకు చెందిన బీవైడీ సంస్థ అమెరికా మార్కెట్‌లోకి రాకుండా అడ్డుకున్నారని వెంకటేశ్ ప్రసాద్ ఆరోపించారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు భారత్ విషయానికి వచ్చేసరికి జాతీయ భద్రతా హక్కులను ప్రశ్నిస్తూ వ్యాఖ్యలు చేయడం సరికాదని మండిపడ్డారు. మస్క్ గొప్ప వ్యాపారవేత్త అయినప్పటికీ, ఆయన వైఖరిలో స్వార్థం కనిపిస్తోందని విమర్శించారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో గతంలో మస్క్ విభేదించిన విషయాన్ని కూడా ప్రసాద్ ప్రస్తావించారు. ట్రంప్ పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉందని ఆరోపించిన మస్క్.. తన వ్యాపార ప్రయోజనాలకు ఇబ్బందులు ఎదురవుతాయనే పరిస్థితుల్లో మౌనం వహించారని వ్యాఖ్యానించారు. వ్యాపార ప్రయోజనాల కోసం ఒక విధంగా, ఇతర దేశాల విషయంలో మరో విధంగా మాట్లాడటం సరికాదని తన పోస్టులో అభిప్రాయపడ్డారు.

**స్టార్‌లింక్ అనుమతులపై వివాదం**

మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థ భారత్‌లో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలను ప్రారంభించేందుకు అనుమతుల కోసం ప్రయత్నిస్తోంది. ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతోందంటూ మస్క్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీని ఉద్దేశిస్తూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో కొన్ని ప్రాంతాలకు ఇంటర్నెట్ సదుపాయం సరిగా లేదని, స్టార్‌లింక్ సేవల ద్వారా విద్యార్థులకు, చిన్న వ్యాపారులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.మస్క్ వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించింది. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల విషయంలో ఎలాంటి సంస్థపైనా వివక్ష చూపడం లేదని స్పష్టం చేసింది. సంబంధిత సంస్థలు జాతీయ భద్రతా నిబంధనలను పాటించాల్సి ఉంటుందని, నిబంధనల ప్రకారమే అనుమతుల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపింది. స్టార్‌లింక్‌తో పాటు ఇతర సంస్థల దరఖాస్తులనూ నిబంధనల మేరకు పరిశీలిస్తున్నట్లు పేర్కొంది.ఈ నేపథ్యంలో వెంకటేశ్ ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వ్యాపార పోటీ, జాతీయ భద్రత, శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు అనుమతుల అంశాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.

# సీజేపీ నిరసనలకు మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ మద్దతు

- శాంతియుత నిరసన ప్రజాస్వామ్య హక్కు.. ఎక్స్ వేదికగా స్పందన



**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనలకు భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ మద్దతు తెలిపారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న హక్కు అని పేర్కొంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు.'శాంతియుత నిరసనలు ప్రజాస్వామ్య కార్యకలాపం. చివరిసారిగా నేను విన్నప్పుడు భారత్ ప్రజాస్వామ్య దేశంగానే ఉంది' అని మంజ్రేకర్ వ్యాఖ్యానించారు. ఆయన చేసిన ఈ పోస్టు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపిస్తున్న సీజేపీ.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చింది. అయితే, ప్రదర్శనకు అనుమతి నిరాకరించడంతో పాటు భద్రతా ఏర్పాట్లను పోలీసులు కట్టుదిట్టం చేశారు. నిరసనకు బయలుదేరిన సీజేపీ నేతలను కూడా అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి.ఈ పరిణామాలపై మంజ్రేకర్ స్పందిస్తూ శాంతియుత నిరసనల ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. రాజకీయ, సామాజిక అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు ప్రజలకు ప్రజాస్వామ్య వ్యవస్థలో అవకాశం ఉండాలన్న సందేశాన్ని ఆయన పోస్టు ద్వారా వెల్లడించారు. సీజేపీ నిరసనలకు మద్దతుగా మాజీ క్రికెటర్ స్పందించడం రాజకీయ, క్రీడా వర్గాల్లో చర్చకు దారితీసింది.

# కీలక సమయంలో కుల్‌దీప్‌కు బంతి ఇవ్వడమే తప్పిదం!

**రాంచీ, అక్టోబర్ 10:** వెస్టిండీస్‌తో రెండో టీ20లో భారత్ ఓటమిపై మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ స్పందించారు. కీలకమైన 17వ ఓవర్‌ను కుల్‌దీప్ యాదవ్‌కు ఇవ్వడం సరైన నిర్ణయం కాదన్నారు. ఆ ఓవర్‌లో వెస్టిండీస్ 24 పరుగులు సాధించడంతో మ్యాచ్ భారత్ చేజారిందని అభిప్రాయపడ్డారు. ఆ సమయంలో మయాంక్ యాదవ్ లేదా అర్ష్‌దీప్ సింగ్‌తో బౌలింగ్ చేయించి ఉంటే ఫలితం మరోలా ఉండేదని పేర్కొన్నారు. 250 పరుగుల లక్ష్యాన్ని కూడా కాపాడుకోలేకపోవడానికి బౌలింగ్ వ్యూహమే కారణమని విశ్లేషించారు.



# మళ్లీ టీమిండియాకు ఆడకపోయినా నాకేం నష్టం లేదు!

## జట్టులో చోటు దక్కకపోవడంపై మహమ్మద్ షమీ కీలక వ్యాఖ్యలు

## దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నా.. బెంగాల్ జట్టుకు నా ఫిట్‌నెస్ నిరూపించుకున్నా



**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:** భారత జట్టులో తిరిగి చోటు దక్కించుకోవడంపై టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇటీవల భువనేశ్వర్ కుమార్ నాలుగేళ్ల విరామం తర్వాత భారత టీ20 జట్టులోకి తిరిగి ఎంపిక కాగా, షమీకి మాత్రం అవకాశం దక్కలేదు. ఈ నేపథ్యంలో తన ఎంపికపై స్పందించిన షమీ.. ప్రస్తుతం తన దృష్టి మొత్తం దేశవాళీ క్రికెట్‌పైనే ఉందని స్పష్టం చేశాడు.భువనేశ్వర్ కుమార్‌కు భారత జట్టులో ఆడే అవకాశం లభించడం సంతోషకరమని షమీ పేర్కొన్నాడు. అయితే, అతడి ఎంపికతో తనకు సంబంధం లేదని తెలిపాడు. తనకు ఎక్కడ ఆడే అవకాశం వచ్చినా అత్యుత్తమ ప్రదర్శన చేయడమే లక్ష్యమని చెప్పాడు. ప్రస్తుతం రంజీ ట్రోఫీ మ్యాచ్‌పైనే పూర్తిగా దృష్టి పెట్టినట్లు వెల్లడించాడు.గత రెండు, మూడేళ్లుగా తన విషయంలో ఇదే జరుగుతోందని షమీ వ్యాఖ్యానించాడు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నానని, బెంగాల్ జట్టు తరఫున తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నానని తెలిపాడు. అయినప్పటికీ తిరిగి భారత జట్టుకు ఆడే అవకాశం రాకపోతే అది తనకు నష్టం కాదని స్పష్టం చేశాడు.భువనేశ్వర్ కుమార్ పునరాగమనంతో సీనియర్ బౌలర్ల ఎంపికపై చర్చ మొదలైంది. దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్న షమీకి కూడా అవకాశం కల్పించాలని పలువురు మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల మాజీ క్రికెటర్ వసీం జాఫర్ సైతం షమీ, మహమ్మద్ సిరాజ్‌లకు అవకాశాలు ఎందుకు లభించడం లేదని ప్రశ్నించారు.ఇదిలా ఉండగా, రంజీ ట్రోఫీ 2026-27 సీజన్‌లో బెంగాల్ తరఫున ఆడేందుకు షమీ సిద్ధమయ్యాడు. జాతీయ జట్టులోకి తిరిగి రావడంపై చర్చలు జరుగుతున్నప్పటికీ, ప్రస్తుతం తన ఆటపైనే దృష్టి సారిస్తానని అతడి వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# కత్రినా కైఫ్, కృతి సనన్‌లకు మద్దతుగా మృణాల్



బాలీవుడ్ నటీనటులపై, ముఖ్యంగా హీరోయిన్ల వ్యక్తిగత జీవితాలు, దుస్తులు, శరీరాకృతిని లక్ష్యంగా చేసుకుని పెరుగుతున్న ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై నటి మృణాల్ ఠాకూర్ తీవ్రంగా స్పందించారు. తోటి నటీమణులు కత్రినా కైఫ్, కృతి సనన్‌లకు ఆమె బాసటగా నిలిచారు. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని ఇష్టానుసారం జీవించే హక్కు ఉంటుందని, ఇతరుల వ్యక్తిగత ఎంపికలను విమర్శించే అధికారం ఎవరికీ లేదని ఆమె స్పష్టం చేశారు.

ఇటీవల తన 'పూజా మేరీ జాన్' సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మృణాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రసవానంతర శారీరక మార్పుల కారణంగా కత్రినా కైఫ్ బాడీ షేమింగ్‌కు గురికావడం, ఒక జువెలరీ యాడ్‌లో ధరించిన దుస్తుల కారణంగా కృతి సనన్ విమర్శలు ఎదుర్కోవడం వంటి సంఘటనల నేపథ్యంలో ఆమె స్పందించారు.

కత్రినా, కృతి ఇద్దరూ సినిమా రంగానికి ఎంతో సేవ చేశారని, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని గుర్తుచేశారు."ప్రతి విషయంలోనూ తప్పులు వెతకడం మానుకోవాలి. సోషల్ మీడియాలో కొందరి ప్రవర్తన చూస్తుంటే పిచ్చి పట్టినట్లుంది" అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. వారి కృషిని, విజయాన్ని మరిచిపోయి చిన్న విషయాలపై దృష్టి పెట్టడం సరికాదన్నారు. ఒకప్పుడు మహిళలను మాత్రమే ఎక్కువగా విమర్శించేవారని, కానీ ఇప్పుడు పురుషులు కూడా ఇలాంటివి ఎదుర్కొంటున్నారని మృణాల్ పేర్కొన్నారు. కాగా, విమర్శల నేపథ్యంలో కృతి సనన్ నటించిన జువెలరీ ప్రకటనను సంబంధిత సంస్థ ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే.

## రజినీకాంత్ 'జైలర్ 2' టిక్కెట్ రేట్ల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతి

**రోజుకు ఐదు షోలు ప్రదర్శించుకునేందుకు కూడా అనుమతి**

సూపర్ స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'జైలర్ 2' టికెట్ ధరలను పెంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. దసరా పండుగ కానుకగా అక్టోబరు 15న ఈ చిత్రం విడుదలవుతున్న నేపథ్యంలో, తొలి వారం రోజుల పాటు పెంచిన ధరలు అమల్లో ఉంటాయని పేర్కొంటూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరపై గరిష్ఠంగా రూ. 50 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌లలో రూ. 75 (జీఎస్టీతో కలిపి) అదనంగా వసూలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఈ పెరిగిన ధరలు సినిమా విడుదలైన అక్టోబరు 15 నుంచి అక్టోబరు 21 వరకు, అంటే వారం రోజుల పాటు వర్తిస్తాయి. దీనితో పాటు, తొలి వారం రోజుల్లో ప్రతిరోజూ ఐదు షోలు ప్రదర్శించుకునేందుకు కూడా ప్రభుత్వం థియేటర్ యాజమాన్యాలకు అనుమతి ఇచ్చింది.



# 'రణబాలి' ట్రైలర్‌పై చిత్ర బృందాన్ని ప్రశంసించిన మంత్రి లోకేశ్

### థ్యాంక్స్ లోకేశ్ అన్నా..
### సీమ గడ్డ గర్వపడే సినిమా ఇది: విజయ్ దేవరకొండ



విజయ్ దేవరకొండ, రష్మిక మందానా జంటగా నటిస్తున్న 'రణబాలి' సినిమా ట్రైలర్‌పై ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. దీనిపై హీరో విజయ్ దేవరకొండ భావోద్వేగంగా స్పందిస్తూ, ఈ సినిమా ద్వారా రాయలసీమ గడ్డకు తాను రుణం తీర్చుకుంటున్నానని తెలిపారు. విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో 'రణబాలి' అనే పీరియాడిక్ మూవీ తెరకెక్కింది. ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌ను వీక్షించిన మంత్రి లోకేశ్ చిత్ర బృందాన్ని అభినందించారు. రాయలసీమ చారిత్రక పోరాటాన్ని, బ్రిటిష్ పాలకుల అణచివేతను అద్భుతంగా ఆవిష్కరించారని ఆయన కొనియాడారు.లోకేశ్ ప్రశంసలపై విజయ్ దేవరకొండ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "లోకేశ్ అన్నా.. రాయలసీమ నేల నాకు ఎంతో ఇచ్చింది. ఈ గడ్డకు నేను తిరిగి చెల్లించాల్సిన బాధ్యత, రుణం ఈ సినిమా రూపంలో నెరవేరుతోంది. మీ సందేశం మా చిత్ర యూనిట్‌లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది. మన నేల గొప్పతనాన్ని, మన ప్రజల ఆత్మగౌరవాన్ని చూసి ప్రతి ఒక్కరి గుండె గర్వంతో ఉప్పొంగేలా ఈ చిత్రం ఉంటుంది. వెండితెరపై ఒక అద్భుతమైన అనుభూతి మీకోసం వేచి చూస్తోంది" అంటూ లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# నెట్‌ఫ్లిక్స్‌లో భారీ కోతలు..

### 800 మంది ఉద్యోగుల తొలగింపునకు రంగం సిద్ధం!



ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ తమ ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. కంపెనీలోని మొత్తం సిబ్బందిలో సుమారు 5 శాతం మందిని, అంటే దాదాపు 800 మంది ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైనట్లు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దీనికి సంబంధించిన ప్రకటన వచ్చే వారంలోనే ఉండవచ్చని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులను ఉటంకిస్తూ పలు నివేదికలు పేర్కొంటున్నాయి.2025 చివరి నాటికి నెట్‌ఫ్లిక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 16,000 మంది ఫుల్ టైమ్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 68 శాతం మంది అమెరికా, కెనడాలోనే పనిచేస్తున్నారు. తాజా తొలగింపులు కార్యరూపం దాల్చితే, 2022 తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో ఇదే అతిపెద్ద ఉద్యోగాల కోత కానుంది. ఆ సమయంలో కూడా వృద్ధి మందగించడం, సబ్‌స్క్రైబర్లు తాత్కాలికంగా తగ్గడంతో వందలాది మందిని కంపెనీ తొలగించింది. ప్రస్తుతం వినిపిస్తున్న వదంతులపై స్పందించేందుకు నెట్‌ఫ్లిక్స్ నిరాకరించింది.అయితే, ఏయే విభాగాలపై ఈ కోతల ప్రభావం ఎక్కువగా ఉంటుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఫీచర్ ఫిల్మ్‌లపై పనిచేస్తున్న క్రియేటివ్ టీమ్‌లలో కోతలు ఉండవచ్చని భావిస్తున్నారు. స్ట్రీమింగ్ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ, మీడియా సంస్థల విలీనాలు, యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫారమ్‌లు వీక్షకులను, ప్రకటనల ఆదాయాన్ని ఎక్కువగా ఆకర్షిస్తుండటం నెట్‌ఫ్లిక్స్‌కు సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో నెట్‌ఫ్లిక్స్ తన వ్యాపార వ్యూహాన్ని మార్చుకుంటోంది. కేవలం సబ్‌స్క్రిప్షన్‌లపై ఆధారపడకుండా, ప్రకటనలతో కూడిన ప్లాన్‌లు, లైవ్ ప్రోగ్రామింగ్, గేమింగ్ వంటి కొత్త రంగాలపై దృష్టి సారిస్తోంది. ఇటీవల ఒక సదస్సులో మాట్లాడిన కంపెనీ కో-సీఈఓ టెడ్ సారండోస్, తాము వృద్ధి చెందుతున్నప్పటికీ, నాయకత్వం ఆశించిన స్థాయిలో వేగంగా వృద్ధి సాధించలేకపోతున్నామని అంగీకరించారు.ఆర్థికంగా చూస్తే.. ఈ ఏడాది జూలైలో ప్రకటించిన రెండో త్రైమాసిక ఫలితాల్లో కంపెనీ 12.56 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 13 శాతం అధికం. అయినప్పటికీ, 2026 పూర్తి సంవత్సరానికి గాను ఆదాయ అంచనాలను తగ్గించడం, గత ఏడాదిగా కంపెనీ షేరు ధర గణనీయంగా క్షీణించడం వంటి పరిణామాలు పెట్టుబడిదారులలో ఆందోళన కలిగిస్తున్నాయి. అక్టోబర్ 20న కంపెనీ తదుపరి త్రైమాసిక ఫలితాలను ప్రకటించనున్న నేపథ్యంలో ఈ పునర్వ్యవస్థీకరణ చర్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.

# 'ధురంధర్' మరో ఘనత..

## గ్రామీ అవార్డుల బరిలో సౌండ్ ట్రాక్



రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన 'ధురంధర్', 'ధురంధర్-2' సినిమాలు ఏ రేంజ్‌లో సక్సెస్ సాధించాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అదిత్య ధర్ తెరకెక్కించిన ఈ రెండు సినిమాలను ప్రేక్షకులకు విశేషంగా ఆదరించారు. ఒటిటిలోనూ ఈ సినిమాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే 'ధురంధర్-2: ది రివేంజ్' సినిమా మరో ఘనతను సాధించింది. ఈ సినిమా ఆల్బమ్ 2027 గ్రామీ అవార్డుల బరిలో నిలిచింది. మొత్తం 8 విభాగాల్లో అవార్డుల పరిశీలనకు పంపినట్లు నిర్మాణ సంస్థ 'బి62 స్టూడియోస్' అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. ఈ సినిమాకు శాశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందించారు. విజువల్ మీడియాకు సంబంధించి సౌండ్‌ట్రాక్‌గా 'ధురంధర్' ఆల్బమ్‌ని పోటీకి పంపారు. అలాగే పలు పాటలను వేర్వేరు విభాగాల్లో గ్రామీ పరిశీలనకు పంపించారు.

## 'రామాయణ' సినిమాలో మండోదరి పాత్రలో కాజల్ అగర్వాల్



టాలీవుడ్‌లో కాజల్ అగర్వాల్ అడుగు పెట్టి దాదాపు రెండు దశాబ్దాలు అవుతున్నా ఇప్పటికీ హీరోయిన్‌గానే వరుసగా సినిమాలు చేస్తూనే ఉంది. పెళ్లయి బాబు పుట్టిన తర్వాత కూడా తన సినిమాల ఎంపిక విషయంలో తేడా చూపించకుండా కమర్షియల్ పాత్రలను చేయడం చూడవచ్చు. ప్రస్తుతం కాజల్ 'రామాయణ' సినిమాలో మండోదరి పాత్రలో కనిపించబోతోంది. కెరీర్ చివరి దశలో ఉందని భావిస్తున్న సమయంలో రణబీర్ కపూర్, సాయి పల్లవిలు రాముడు, సీత పాత్రలో నటిస్తున్న రామాయణ సినిమాలో కాజల్ అగర్వాల్ కి రావణుడి పాత్రలో నటిస్తున్న యశ్ కి భార్య పాత్రలో నటించే అవకాశం దక్కింది. కచ్చితంగా మండోదరి పాత్రతో కాజల్ మరో నాలుగు, అయిదు ఏళ్లు ఇండస్ట్రీలో కొనసాగే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది దీపావళికి 'రామాయణ 1' సినిమా రాబోతుంది. వచ్చే ఏడాదిలో 'రామాయణ 2' రానుంది.

# ఎలాన్ మస్క్‌కు కమల్ హాసన్ స్ట్రాంగ్ కౌంటర్.. మద్దతుగా కంగనా



టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలపై ప్రముఖ సినీ నటుడు, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ తీవ్రంగా స్పందించారు. దేశ విధానాలను ఏ బిలియనీర్ నిర్దేశించలేరని స్పష్టం చేశారు. కమల్ వ్యాఖ్యలకు నటి, ఎంపీ కంగనా రనౌత్ మద్దతు తెలిపారు.

భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు లైసెన్సింగ్ ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై ఎలాన్ మస్క్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, భారత ప్రధాని అంబానీనా? అంటూ సెటైరిక్ గా ట్వీట్ చేశారు. దీనిపై కమల్ హాసన్ దీటుగా బదులిచ్చారు. "ఏ బిలియనీర్ అయినా, అది భారతీయ అయినా, అమెరికన్ అయినా... దేశ విధానాలను నిర్దేశించలేరు. ప్రతి దేశం తన సొంత ప్రయోజనాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటుంది" అని ఆయన పేర్కొన్నారు.స్వేచ్ఛా వాణిజ్యం గురించి చెప్పే పశ్చిమ దేశాలు రక్షణాత్మక విధానాలు పాటిస్తున్నాయని కమల్ విమర్శించారు. "చైనా ఎలక్ట్రిక్ వాహనాలపై అమెరికా 100 శాతం సుంకాలు విధించి తన దేశీయ పరిశ్రమను కాపాడుకుంటోంది. భారత్ కూడా అదే విధంగా తన దేశీయ తయారీ రంగాన్ని పరిరక్షించుకోవడానికి చర్యలు తీసుకుంటోంది" అని వివరించారు.

"భారత్ ఒక ప్రజాస్వామ్య దేశం, వలస పాలిత ప్రాంతం (కాలనీ) కాదు. మేము ప్రపంచాన్ని స్వాగతిస్తాం. కానీ మా భవిష్యత్తును భారత ప్రజలమే నిర్ణయించుకుంటాం" అని కమల్ హాసన్ తన పోస్టులో తేల్చిచెప్పారు.

కమల్ పోస్టును రీషేర్ చేస్తూ కంగనా రనౌత్ స్పందించారు. "ఇది మస్క్‌కు బాగా తగిలి ఉంటుంది. ఏ బిలియనీర్ దేశ విధానాలను నిర్దేశించకూడదు. కమల్ చాలా స్పష్టంగా, వ్యంగ్యంగా, సూటిగా చెప్పారు" అంటూ ప్రశంసించారు. ఇప్పటికే మస్క్ ఆరోపణలను భారత కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ నిరాధారమైనవని కొట్టిపారేసిన విషయం తెలిసిందే.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613